

ఉండ్రాళ్లయ్యకు ఊరేగింపు



మండపేటలో పాటిమీద శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు

జిల్లాలో శుక్రవారం వినాయక విగ్రహాల నిమజ్జనాలు ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించగా కొన్నిచోట్ల లడ్డూ పాటలు జరిగాయి..



యానాంలో శివరాజ గణపతి వద్ద పెన్నుల పూజ

టీచర్లకు సన్మానం



రాయవరం మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

మిలాద్ ఉన్ నబీ వేడుకలు



మామిడికుదురు మండల నగరంలో కవిత్వం ఆలపిస్తున్న కవి

ముస్లింల ఆరాధ్య దైవం మహ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్ ఉన్ నబీని జిల్లావ్యాప్తంగా ఆనందోత్సాహాలతో శుక్రవారం నిర్వహించారు. మసీదుల్లో ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు.

నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే

- కలెక్టర్ మహేశ్‌కుమార్
- కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి గురుపూజోత్సవం

అమలాపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని కలెక్టర్ ఆర్.మహేశ్‌కుమార్ అన్నారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే మహత్కార్యం ఉపాధ్యాయులే చేస్తున్నారన్నారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి గురుపూజోత్సవాన్ని శుక్రవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లీ, తండ్రి, గురువు నిత్యపూజనీయులన్నారు. విద్యార్థుల భవితకు దిశా, లక్ష్యం, మార్గం చూపించే వాడే నిజమైన గురువు అని పేర్కొన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధిస్తే ఉన్నతశిఖరాలను అధిరోహిస్తారన్నారు. జిల్లా స్థాయిలో 64మంది ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సన్మాన పత్రాలను కలెక్టర్ అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి కొత్త మాధవి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వన్నెతెచ్చారని కొనియాడారు. పవిత్రమైన ఉపాధ్యాయవృత్తిని ఎంచుకున్న ఆయన దేశ ప్రథమ పౌరుడి స్థాయికి ఎదిగి రాష్ట్రపతిగా పనిచేశారని కొనియాడారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని తొలుత గుర్తించిన మహనీయుడు రాధాకృష్ణన్ అని కొనియాడారు. ప్రపంచంలో అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తికే ఎంతో గౌరవం ఉందన్నారు. విద్యార్థులు ఎంత ఎత్తుకు ఎదిగినా అక్షరాలు నేర్పించిన ఉపాధ్యాయులను మరిచిపోలేరన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను పేరుపేరునా పిలిచి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, బీసీఈబీ సభ్యుడు బీర హనుమంతరావు, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, డీఎస్వో జీవీఎస్ సుబ్రహ్మణ్యం, సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ఉప విద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశం, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి పాల్గొన్నారు.



గురుపూజోత్సవాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేశ్



జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేస్తున్న కలెక్టర్ మహేశ్‌కుమార్



ఆకాశమే హద్దు!

భవన నిర్మాణాల ఎత్తు 24 మీటర్లకు పెంచే యోచన

నగరాల్లో భవనాల ఎత్తు పెరగనుంది. అవసరమైతే పెంచుకోవడానికి, కొత్తవి పెంచి కట్టుకోవడానికి అవకాశం కలగనుంది. రాష్ట్రంలో భవనాల గరిష్ట ఎత్తు పరిమితిని 18 మీటర్ల నుంచి 24 మీటర్లకు పెంచనున్నట్లు పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తాజాగా ప్రకటించారు.దీనిపై శాసనసభలో ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో పెరుగుతున్న జనాభా అవసరాలు, పట్టణాభివృద్ధి దృష్ట్యా ఎంతో ఉపయోగకరంగా మారనుంది.

(రాజమహేంద్రవరం/ కాకినాడ కార్పొరేషన్- ఆంధ్రజ్యోతి)

ఇక అపార్ట్‌మెంట్లు ఆకాశహర్మ్యాలు కానున్నాయి. ఇప్పటి వరకూ ఐదంతస్తుల వరకే భవన నిర్మాణాలకు అనుమతి ఉంది. అంటే 18 మీటర్ల కంటే ఎత్తు దాటి అపార్టుమెంట్లు,ఇతర భవనాలు నిర్మించకూడదు. 18 మీటర్ల ఎత్తు దాటితే వాటిని హైరైజ్డ్ భవనాలు కింద పరిగణిస్తారు. వాటి నిబంధనలు,అనుమతులు వేరేగా ఉంటాయి. కూటమి ప్రభుత్వం ఈ నిబంధన సడలించనుంది. సాధారణ అపార్ట్‌మెంట్ల ఎత్తు 24 మీటర్ల వరకూ పెంచనుంది.అప్పుడు ఏడం తస్తుల వరకూ నిర్మించుకునే అవకాశం ఉంటుంది.

జనం ఎదురుచూపులు..

ఇంత వరకూ సుమారు 400 గజాల్లో నాలుగంతస్తులు, 600 గజాల్లో ఐదంతస్తులు కట్టుకునేందుకు అనుమతి ఉంది. భవనాల ఎత్తును 24 మీటర్లకు పెంచడం వల్ల ఏడంతస్తులు కట్టుకోవచ్చు. స్థలం ఎక్కువ ఉంటే హైరైజ్డ్ భవనాలు నిర్మించుకోవచ్చు. హైరైజ్డ్ నిర్మాణాలకు అదనంగా సిటీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్, అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీలు, రేరా అనుమతులతో పాటు ఎయిర్‌ఫోర్ట్, ఫైర్ డిపార్ట్‌మెంట్ల అనుమతులు తీసుకోవాల్సి వస్తుంది. ప్రభుత్వ నిర్ణయం కోసం అంతా ఎదురుచూస్తున్నారు. భూమి విలువ పెరగడం వల్ల హైరైజ్డ్ భవన నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది.దీంతో తక్కువ భూమిలో ఎక్కువ మంది నివసించే అపార్టుమెంట్ కల్చర్ మరింత పెరగనుంది.

కీలక మలుపు..

భవనాల గరిష్ఠ ఎత్తు పరిమితిని 18మీటర్ల నుంచి 24మీటర్లకు పెంచే నిర్ణయం రాష్ట్ర పట్టణాభివృద్ధిలో కీలక మలుపుగా భావించవచ్చు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం కార్పొరేషన్లతో పాటు కాకినాడ జిల్లాలో నాలుగు, కోనసీమలో మూడు, తూర్పుగోదావరి జిల్లాలో రెండు మునిసిపాలిటీలు ఉన్నాయి. తాజా నిర్ణయంతో పట్టణాల్లో మౌలిక వసతుల విస్తరణతో పాటు నివాస, వాణిజ్య అవసరాలకు సమతుల్యత కలుగుతుంది. బిల్లు శాసనసభలో ఆమోదం పొందిన వెంటనే రాష్ట్ర నిర్మాణ రంగం కొత్త దిశగా పయనించే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో ఇప్పటి వరకు ఐదంతస్తుల భవనాలే ఎక్కువగా నిర్మించారు. ఇకపై ఏడంతస్తుల భవనాలు వచ్చే అవకాశాలున్నాయి. ఎత్తు మార్పు నిర్ణయం వల్ల కార్పొరేషన్లు, మున్సిపాల్టీలోని పట్టణ ప్రణాళికలో మార్పులు తప్పనిసరి కానున్నాయి. భవన సముదాయాల ఎత్తు పెరగనుండడంతో ట్రాఫిక్, పార్కింగ్‌తోపాటు నీరు, విద్యుత్ సరఫరా, మౌలిక వసతుల పెంపు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని కొత్త ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.

తాజా నిర్ణయంతో లాభాలు

నగరాభివృద్ధికి ఊతం : భూమి వినియోగం సమర్థవంతం అవుతుంది.
గృహావసరాలు తీర్చడం : మరిన్ని ప్లాట్లు, అపార్టుమెంట్ల నిర్మాణానికి అవకాశం.
వాణిజ్య వృద్ధి : షాపింగ్‌మాల్స్, ఐటీ టవర్స్, వాణిజ్య సముదాయాలకు మార్గం.
ఆర్థిక లాభాలు : పెట్టుబడులు పెరిగి ఉపాధి అవకాశాలు ఎక్కువగా కలగనున్నాయి.

- ఇప్పటి వరకూ ఐదంతస్తులే
- 18 మీటర్లకే అనుమతి
- ఇక ఏడంతస్తుల మేడలు
- ఇక అన్నీ హైరైజ్డ్ భవనాలే
- త్వరలో శాసనసభలో చర్చ
- ఎస్ఎఫ్‌టీపై అయోమయం
- పట్టణాభివృద్ధికి దోహదం
- నిర్మాణ రంగానికి కొత్త ఊపు
- మారనున్న పట్టణ ప్రణాళిక

5 కాదు..ఏడంతస్తులు

హైదరాబాద్, వైజాగ్ వంటి నగరాల్లో ఇప్పటికే ఆకాశహర్మ్యాలు నిర్మించారు. 150 మీటర్ల ఎత్తు వరకూ అనుమతిస్తున్నారు. 35 నుంచి 40 అంతస్తులు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. మన ప్రాంతాల్లో అంత ఎత్తులో భవనాలు నిర్మించడానికి గతంలో అనుమతులు లేవు. సాధారణ అపార్ట్‌మెంట్లను ఐదంతస్తుల వరకే పరిమితం చేశారు..తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాధారణ అపార్ట్ మెంట్లను ఏడంతస్తుల వరకూ నిర్మించుకునే అవకాశం కల్పించనుంది. ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు విడుదల చేయనున్నారు. రాజమహేంద్రవరంలో సుమారు 8 వరకూ హై రైజ్డ్ భవనాలు ఉన్నట్టు అధికారుల కథనం.

కూటమి ప్రభుత్వంతో చిన్న వ్యాపారస్తులకు ప్రోత్సాహం

- గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్

రాజోలు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతో చిన్న వ్యాపారస్తులకు ప్రోత్సాహం లభిస్తుందని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు ఎంపీపీ కడలి శ్రీదుర్గ అన్నారు. రాజోలులో నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ ద్వారా వచ్చిన ఎగ్ కార్ట్‌ను శుక్రవారం వారు కాళ్ల నాగబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.60వేలు విలువ చేసే ఎగ్‌కార్ట్‌ను ఉచితంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రోత్సాహాలు అందించి ప్రజలను అభివృద్ధి పథంలో కూటమి ప్రభుత్వం నడిపిస్తుందన్నారు. కార్యక్రమంలో చాగంటిస్వామి, సూరిశెట్టి శ్రీనివాస్, అడబాల యుగంధర్, పామర్తి రమణ, ఉలిశెట్టి అన్నపూర్ణ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రేకపల్లి సత్యవాణి, చింతలపల్లి లక్ష్మి, కాట్నరాజు, అడబాల విజయ్, దారపురెడ్డి బాబ్జి,కోళ్ల బాబి, ఏపీవో బి.వర్మ, నాగేంద్ర పాల్గొన్నారు.

నేడు బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పర్యటన

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ రెడ్డి అనంతకుమారి కాకినాడ జిల్లాలో శనివారం పర్యటించనున్నారు. కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం 3గంటలకు కాకినాడ డీఆర్‌డీఏ ఆఫీస్‌లో ఆమె అధ్యక్షతన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న బీసీ కులాల కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్స్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు సిబ్బందితో సమావేశం జరగనుంది. సమావేశం అనంతరం సాయంత్రం 5గంటలకు మీడియా సమావేశం నిర్వహించనున్నారు.

పెరిగి తగ్గి!

- తాజాగా రికార్డుస్థాయిలో రూ.5.70కి చేరిన గుడ్డు ధర
- ఒకరోజులో కాస్త తగ్గి రూ.5.45కి పడిపోయిన వైనం
- గతేడాది అధిక ధర రూ.6.05 పైసలు
- ఈఏడాది కొంత తగ్గినా.. రైతుకు కాస్త ఊరట



మండపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గుడ్డు ధర పైపైకి వెళ్లి మళ్లీ కాస్త తగ్గింది. అందరికీ అందుబాటులో పుష్కలంగా విటమిన్లు కలిగి ఉన్న గుడ్డు భలే ఫుడ్ అన్నట్టుగా తింటుంటారు. గుడ్డు ధర ఉన్నట్టుండి హోల్‌సేల్‌గా రైతువద్ద గురువారం రూ.5.70కి చేరింది. కానీ, శుక్రవారం మాత్రం రూ.5.45కి తగ్గింది. మార్కెట్‌లో రిటైల్‌గా మాత్రం రూ.7కు విక్రయిస్తున్నారు.

ఉత్పత్తి తగ్గడంతో..

ఈ మధ్యకాలంలో గుడ్డు ఉత్పత్తి తగ్గడంతోపాటు పరిశ్రమ నష్టాలకు గురికావడంతో చాలామంది రైతులు కోళ్లఫారాలను మూసివేశారు. దీంతో ధర పెరిగిందని చెప్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి గుడ్డుకు భారీగా ఆర్డర్లు రావడంతో కోళ్ల రైతులు ఊరట చెందుతున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో కోడిగుడ్డుకు డిమాండ్ లేకపోవడం, ధర కూడా గిట్టుబాటు లేకపోవడంతో చాలామంది రైతులు కోళ్ల బ్యాచ్‌లను వేయకుండా ఖాళీగా వదిలేశారు. ఈ ఏడాది ఎండలు కూడా ఎక్కువగా ఉండడంతో ఆ ప్రభావం కోళ్ల పరిశ్రమపై పడింది. దీంతో ఉత్పత్తి తగ్గి ఇప్పుడు డిమాండ్ పెరిగింది.

పొరుగు రాష్ట్రాలకు 60శాతం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1.10కోట్ల కోళ్లు వరకు ఉన్నాయి. వాటి ద్వారా నిత్యం 1.4కోట్ల మేర గుడ్లు ఉత్పత్తి అవుతుంటాయి. ఇక్కడ 40శాతం మేర గుడ్డు స్థానికంగా వినియోగిస్తుండగా 60శాతం మేర గుడ్లు పొరుగురాష్ట్రాలైన ఒడిసా, బిహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతవుతుంటాయి. గతేడాది గుడ్డు ధర రూ.6.05 పలకగా ఈఏడాది మాత్రం రూ.5.70 అధిక ధరగా ఉంది. ఈ ఏడాది ఇదే రికార్డుస్థాయి ధర కావడం విశేషం.

భారంగా కోళ్ల ఆహారం

కమింగ్‌రేటు పేరిట ఏజెంట్‌లుఫారం రైతుకు ప్రక టించిన ధర కంటే 25పైసల వరకు కోత విధిస్తున్నారని నిర్వాహకులు వాపోతున్నారు. గుడ్డు ధర పెరిగినా కోళ్లకు వాడే ఆహారం ముడిసరుకు మొక్కజొన్న, నూకలు, సోయా ధరలు పెరుగుదల భారంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోళ్ల మందులు, ముడి సరుకును ప్రభుత్వం సబ్సిడీపై అందించి పరిశ్రమను ఆదుకోవాలని సుదీర్ఘకాలంగా కోళ్ల రైతులు విజ్ఞప్తి చేస్తున్నా రాయితీలు కల్పించకపోవడంవల్ల పరిశ్రమ ఒడిదుడుకులు మధ్య నడుస్తోందని కోళ్ల రైతు ఒకరు తెలిపారు. గుడ్డు ధర నిలకడగా ఉండదని, ఎగుడుదిగుడులు మార్కెట్‌లో సహజమని ఆయన అన్నారు. గుడ్డు ధర పెరగడం కోళ్ల రైతులకు జోష్ నింపగా వినియోగదారుడికి ధర కాస్త భారంగా మారింది.

డిమాండ్ పెరగడంతో...

వర్షాకాలంలో ఉత్తరాది రాష్ట్రాల్లో వరదల కారణంగా ఉద్యాన పంటలు దెబ్బతినడంతో గుడ్ల వినియోగం పెరిగింది. దీంతో తెలుగు రాష్ట్రాలనుంచి ఆయా రాష్ట్రాలకు గుడ్ల ఎగుమతులు పెరిగాయి. మనరాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లోను మధ్యాహ్న భోజన పథకంలో గుడ్డు ప్రవేశపెట్టడంతో దాని అవసరం మరింత పెరిగింది. పొరుగు రాష్ట్రాల్లో పాఠశాలలకు కూడా ఏపీ, తెలంగాణారాష్ట్రాల నుంచి గుడ్డు ఎగుమతులు జరుగుతున్నాయి. ఇలా ఇక్కడ గుడ్డు ఉత్పత్తి తగ్గడం.. డిమాండ్ పెరగడంతో ధర పెరుగుదలకు కారణమని పరిశ్రమ నిర్వాహకులు చెబుతున్నారు. డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి వచ్చేవరకు గుడ్డు ధర తగ్గేది లేదని పరిశ్రమ నిర్వాహకుడు ఒకరు తెలిపారు. కోళ్ల మేతలో వాడే ముడిసరుకు నూకలు ఏడాదికాలంగా లభ్యం కావడం లేదని కోళ్లపరిశ్రమ నిర్వాహకుడు, మండపేట మండలం అర్తమూరుకు చెందిన ఎస్.బీఎస్.ఆర్ కోళ్లపరిశ్రమ అధినేత సత్తి బుల్లిస్వామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ధర ఎంత పలికినా గతంలో వచ్చిన నష్టం నుంచి పరిశ్రమ కోలుకోవడం కష్టతరంగా ఉందని తెలిపారు.

రామేశ్వరం మొగ ప్రారంభం

- 35వేల ఎకరాల ఆయకట్టు ముంపునకు మోక్షం

అల్లవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రతిఏటా ఇసుక మేట వేసి మూసుకుపోతున్న రామేశ్వరం మొగలో 200 ఎక్స్‌కవేటర్ల ద్వారా ఇసుక మేటలు తొలగించి మొగను ప్రారంభించారు. అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల పరిధిలోని 35వేల ఎకరాల ఆయకట్టునుంచి ముంపు నీరు సముద్రంలో కలుస్తోంది. అల్లవరం మండలం కొమరగిరిపట్నం శివారు రామేశ్వరం వద్ద డ్రైనేజీ శాఖ ఆధ్వర్యంలో అల్లవరం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ పర్యవేక్షణలో మొగలో తవ్వకాలు జరిపారు. రామేశ్వరం మొగ ద్వారా ముంపు నీరు సముద్రంలోకి వేగంగా దిగుతోంది. ప్రతిఏటా ఇసుక మేటలు తొలగించడం ఆనవాయతీగా వస్తోంది. సముద్రపు కెరటాల తాకిడికి, గాలులకు ఇసుక మేట వేసి మొగ మూసుకుపోతోంది. 450 మీటర్ల నుంచి 500 మీటర్ల పొడవున, 50మీటర్ల వెడల్పున రామేశ్వరం మొగలో ఇసుక మేటలు తొలగించారు. డ్రైన్స్ డీఈఈ ఎంపీపీ కిశోర్, ఏఈ కె.సునీత, అల్లవరం వాటర్‌డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దాట్ల గోపీరాజు రామేశ్వరం మొగను పరిశీలించారు. రామేశ్వరం మొగలోతు, వెడల్పు పెంచేలా ఇంకా మొగ ఆధునీకీకరణ పనులను జరుపుతున్నామని డ్రైన్స్ ఏఈ సునీత అన్నారు. ఇసుక మేటలతో మూసుకుపోతున్న రామేశ్వరం మొగకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.



అల్లవరం మండలం రామేశ్వరం మొగ వద్ద తవ్వకాలు పరిశీలిస్తున్న డ్రైన్స్ డీఈఈ, ఏఈ, డీసీ చైర్మన్‌లు

రూ.40 కోట్లకు కుచ్చుటోపీ 7
- చిట్టీల పేరుతో మోసం చేసి పరారైన వ్యాపారి

గురువు విగ్రహాన్ని ఏర్పాటు చేసిన శిష్యులు 6



తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి, ఆదిరెడ్డి వాసు పాల్గొన్నారు.



కాకినాడ జిల్లా కాకినాడలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా సిటీ ఎమ్మెల్యే కొండబాబు, కలెక్టర్ షాన్‌మోహన్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయుడు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ బీఆర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మహేష్‌కుమార్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయురాలు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై తిరుగుతూ.. సమస్యలు తెలుసుకుంటూ

● వరద ముంపు గ్రామాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష పర్యటన



వడ్డిగూడెంకు ట్రాక్టర్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

వీఆర్‌పురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలోని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి శుక్రవారం ముంపు గ్రామాల్లో ట్రాక్టర్‌పై పర్యటిస్తూ ... బాధితుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రధానంగా ముంపులో ఉన్న వడ్డిగూడెంకి వెళ్లి గ్రామ స్థులతో మాట్లాడారు. ఈ సం దర్భంగా వారంతా మాట్లాడుతూ గత 15 రోజు లుగా గోదావరి వరదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మాకు పూర్తిస్థాయి సాయం అందలేదన్నారు. వరద సాయం ముఖ్యం కాదు, పోలవరం ప్యాకేజీ పూర్తిస్థాయిలో త్వరగా అందించాల న్నారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ బాధితులందరికీ వరద సాయం అందిస్తామని, అలాగే పోలవరం బాధితులకు నష్టపరిహారం సాధ్యమైనంత త్వరగా అందించేందుకు సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బోట్‌పై శబరిగుండా ముంపులో ఉన్న రామవరం, చింతరేగుపల్లి, తదితర గ్రామాలకు వెళ్లారు. ఈమెతోపాటు మండల టీడీపీ నాయకులు, మండల స్థాయి అధికారులు, పోలీస్ సిబ్బంది కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

హైలెస్సా ....!

● నిలిచిన ఆర్టీసీ.. నెట్టిన ఆటో డ్రైవర్లు



రౌతులపూడిలో బస్సును నెడుతున్న ఆటోడ్రైవర్లు

రౌతులపూడి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి సినిమా సెంటర్ రహదారి మధ్యలో శుక్రవారం ఓ ఆర్టీసీ బస్సు నిలిచిపోయింది. ఇటీవల కాలంలో తరచూ బస్సులు మొరాయిస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. కోటనందూరు నుంచి కాకినాడ వెళుతున్న బస్సు రౌతులపూడి వచ్చింది. అక్కడ గల మహాలక్ష్మి విశ్రాంతి భవనం వద్ద ప్రయాణికులు ఎక్కిన తరువాత బస్సు కదల్లేదు. రహదారి మధ్యలో నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దాన్ని గమనించిన ఆటోడ్రైవర్లు హైలెస్సా అంటూ నెట్టిన దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' ఇలా క్లిక్‌మనిపించింది.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..





తూర్పుగోదావరి జిల్లా నుంచి

నక్కిన వీర రాఘవరావు, జడ్పీహెచ్ఎస్, కుతుకులూరు.

మోతూరి మంగరాణి, ఎంపీఎల్, లాలాచెరువు.

బత్తిన రాజరాజేశ్వరి, జడ్పీహెచ్ఎస్, ప్లస్ శాటిలైట్ సిటీ (బీ బ్లాక్).

కాకినాడ జిల్లా నుంచి





కోటంరాజు గాయత్రి, జడ్పీహెచ్ఎస్, ఏపీఎస్పీ, రమణయ్యపేట .

పతివాడ రవిశంకర్, జడ్పీహెచ్ఎస్, కొమరగిరి.

బొబ్బాది ప్రవీణ్‌కుమార్, జడ్పీహెచ్ఎస్, కొత్త పెరుమాళ్లపురం.

విజయవాడలో శుక్రవారం జరిగిన గురుపూజోత్సవంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , మంత్రి లోకేష్ నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకుంటున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు.

కోనసీమ జిల్లా నుంచి





గూడెపల్లి ప్రభావతి, జడ్పీహెచ్ఎస్, సఖినేటిపల్లి

ఆలేటి దుర్గాప్రసాద్, ఏపీ మోడల్ స్కూల్ , అవిడి

చిట్టినీడి నిరంజని, జడ్పీహెచ్ఎస్, కాట్రేనిపాడు.

← ఎడమ వైపు నుంచి..

చిరుత కలకలానికి...

నిన్నటితో ఏడాది



దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో సంచరించిన చిరుత (ఫైల్)

దివాన్‌చెరువు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు అటవీప్రాంతంలో చిరుతపులి కలకలం సృష్టించి సరిగ్గా శుక్రవారంతో ఏడాది పూర్తి అయ్యింది. అప్పట్లో చిరుత సంచారంతో ఇక్కడిప్రజలు తీవ్ర ఆందోళన చెందారు. కాగా, అటవీ అధికారులు చర్యలు తీసుకోవడానికి ఇది కూడా ఒక కారణమయ్యింది. దివాన్‌చెరువు సమీపంలోని పుష్కరవనం వైపు నుంచి అర్ధరాత్రి సమయంలో ఒక చిరుత రాష్ట్ర అటవీ అకాడమీ వైపు వెళ్లిందన్న వార్తలతో ప్రజలు భయాందోళన చెందారు. దీంతో జిల్లా అటవీ అధికారులు చిరుత పులి ఉనికికి సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు బృందాలను ఏర్పాటు చేసి.. కదలికపై ట్రాప్ కెమెరాలతో నిఘా పెట్టారు. ఎట్టకేలకు దాని పాదముద్రలు గుర్తించి అటవీ అకాడమీ వెనుక గల అభయారణ్యంలో చిరుత సంచరిస్తున్నట్టు నిర్ధారించారు. అలాగే బోను కూడా సిద్ధం చేశారు. అయితే దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో కొన్నిసార్లు దాని కదలికలను ట్రాప్‌కెమెరాలలో అధికారులు కనుగొన్నప్పటికీ తప్పించుకోగలిగింది. ప్రజాభద్రతను దృష్టిలో ఉంచుకుని అటవీఅధికారులు స్థానికులకు పలు సూచనలు చేసి సహకరించాలని కోరారు. అనంతరం ఈ చిరుత కడియం వైపు వెళ్లినట్టు వార్తలు రావడంతో ఈప్రాంత ప్రజలు ఆందోళన నుంచి బయటపడ్డారని చెప్పొచ్చు.

రేపు చంద్రగ్రహణం

» తెరిచే ఉండనున్న పాదగయ క్షేత్రం
» గ్రహణ సమయంలో అభిషేకాలు
» పుష్కరిణిలో పట్టు విడుపు స్నానాలు



పిఠాపురంలోని పాదగయ క్షేత్రం



చంద్రగ్రహణం సమయంలో తెరిచి ఉంచే కుక్కుటేశ్వరుని ఆలయం

పిఠాపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రహణ సమయంలో రాష్ట్రంలోని అన్ని ఆలయాలను మూసివేస్తారు. కేవలం రెండు ఆలయాలు తప్ప. అందులో ఒకటి శ్రీకాళహస్తి, మరొకటి కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షే త్రం. గ్రహణ సమయంలో ఈ రెండుచోట్లా పూ జలు జరుగుతాయి. రాష్ట్రంలో ఈనెల 7వ తేదీ రాత్రి చంద్రగ్రహణం ఏర్పడుతోంది.ఈ నేపథ్యం లో ఆ రోజు మధ్యాహ్నం నుంచే అన్ని ఆలయాలను మూసివేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు. ఈ సమయంలో పిఠాపురం పాదగయ క్షేత్రం లో ఉన్న కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం తెరిచే ఉంటుంది. ఇక్కడ యథావిధిగా పూజలు జరుపుతారు. గ్రహణ సమయంలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. గ్రహణ పట్టు, విడుపు సమయాల్లో పాదగయ పు ష్కరిణిలో భక్తులు స్నానాలు ఆచరిస్తున్నారు. పురాతన కాలం నుంచీ వస్తున్న సం స్కృతీ, సంప్రదాయాలకు అనుగుణంగా పాదగయ క్షేత్రా న్ని గ్రహణ సమయంలో తెరిచి ఉంచి కుక్కుటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ వేద పండితులు, కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు.

అప్పనపల్లి ఆలయం మూసివేత

మామిడికుదురు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీన సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి శ్రీబాలబాలాజీ ఆలయాన్ని మూసివేస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 1 గంటలకు ఆలయాన్ని మూసివేసి సంప్రోక్షణ, ప్రత్యేక పూజల అనంతరం సోమవారం ఉదయం 10 గంటలకు ఆలయం తెరుస్తామని తెలిపారు. అప్పటి నుంచి యథావిధిగా స్వామివారి దర్శనాలు జరుగుతాయని పేర్కొన్నారు.

పాలకొల్లులో అంతర్జాతీయ చలన చిత్ర పోటీలు

మంత్రి దుర్గేష్‌కు ఆహ్వానం



మంత్రి దుర్గేష్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కమిటీ సభ్యుల

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో పాలకొల్లులో అంతర్జాతీయ చలన చిత్ర పోటీలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు కమిటీ సభ్యులు శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో కేశిరాజు రాంప్రసాద్, అడ్డాల నాని తదితరులున్నారు.

కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్

అధ్యక్షుడిగా సూరిబాబు ప్రమాణ స్వీకారం



నూతన అధ్యక్షుడు సూరిబాబును సత్కరిస్తున్న దృశ్యం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి తరలివచ్చిన మిల్లర్లు

సామర్లకోట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ అధినేత వల్లూరి సూర్యప్రకాశరావు (సూరిబాబు) శుక్రవారం ప్రమాణం చేశారు. సామర్లకోట ఏడీబీ రోడ్డులోని అచ్చంపేటలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో అంబటి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షులుగా పేకేటి నాగేశ్వరరావు, కొయ్య శ్రీనివాసు, సంయుక్త కార్యదర్శిగా కొత్త భైరవకృష్ణ, కోశాధికారిగా పెద్దిరెడ్డి రామానుజయ్య, కార్యదర్శిగా మొగలి అప్పారావు ప్రమాణ స్వీకారం చేశారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి సూరిబాబు కృషి చేస్తారనే విశ్వాసం అందరిలోనూ ఉందన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హాజరైన రైస్ మిల్లర్లు సూరిబాబును ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.పారిశ్రామికవేత్తలైన లలితా ఎంటర్‌ప్రైజెస్ అధినేతలు మట్టే సత్యప్రసాద్, మట్టే శ్రీనివాసు, చింతల శ్రీనివాసు, గుమ్మళ్ల సత్యనారాయణ, జొన్నాడ సందీప్, ఈదర చౌదరి, కొండపల్లి కృష్ణమూర్తి, తెలుగు రైతు కాకినాడ పార్లమెంటరీ అధ్యక్షుడు పాలకుర్తి శ్రీనుబాబు, పాలకుర్తి రవిబాబు పాల్గొన్నారు.

శిష్యుల గురుభక్తి

» పెనికేరులో ఉపాధ్యాయుడి విగ్రహం ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులు



పెనికేరులో కుడిపూడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆలమూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెనికేరు గ్రామంలో జైశంకర్ పేరుతో ప్రైవేట్ స్కూల్‌ను ఏర్పాటుచేసి ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పిన కుడిపూడి వెంకటరమణమూర్తి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆ స్కూల్లో చదివిన విద్యార్థులు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాన్ని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్, టీడీపీ నాయకుడు ఈదల చినబాబు ఆవి ష్కరించి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. మాస్టారు కుటుంబానికి పూర్వ విద్యార్థులు సేకరించిన రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. గురువు వెంకటరమణ మూర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన శిష్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

పెరుగుతున్న డొంకరాయి జలాశయ నీటిమట్టం

మోతుగూడెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా అల్లూరి సీతారామరాజు జిల్లా డొంకరాయి జలాశయం నీటిమట్టం పెరుగుతోందని జెన్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కరరావు తెలిపారు. శుక్రవారం నుంచి ఏ రోజైనా జలాశయం గేట్లు ఎత్తే అవకాశం ఉందని ప్రకటించారు. శుక్రవారం రాత్రి 10గంటలకు మొదటి నుంచి 3వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయనున్నారు. జలాశయానికి దిగువన ఉన్న ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.

తగ్గుతున్న గోదావరి ఉధృతి

ధవళేశ్వరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి తగ్గుముఖం పడుతోంది. గురువారం అర్ధరాత్రి వరకు పెరిగిన నీటి మట్టం 11.50 అడుగులకు చేరుకుని శుక్రవారం ఉదయం 9గంటల వరకు నిలకడగా ఉంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ ద్వారా 9,41,785 క్యూసెక్కులు దిగువకు ప్రవహించింది. ఆపై క్రమంగా తగ్గుతున్న నీటి మట్టం రాత్రి 7గంటలకు 11.20 అడుగులకు చేరుకోగా 9లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది.

గణనాథుడి నాణేనికి 409 ఏళ్లు



మండపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) స్వాతంత్ర్యం రాకముందు మన దేశాన్ని పాలించిన ఈస్ట్ ఇండియా పాలకులు మన దేశ సనాతన ధర్మ, మత ఆచారాలను కూడా ఆచరించే వారు. హిందూ దేవుళ్లపై భక్తితో వారు 1616వ సంవత్సరంలో వినాయకుడు ప్రతిమను రెండనాల రాగి నాణెంపై ముద్రించి హిందూ ధర్మం పట్ల వారి కున్న భక్తిని చాటుకున్నారు. ఆనాటి నాణం నేటికీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి చెందిన తోరాటి నాగభూషణం వద్ద భద్రంగా ఉంది. ఆ నాణేనికి నేటికి 409 సంవత్సరాలు వయస్సు ఉండడం గమనార్హం.

10 నుంచి 'యోగా ఇన్నర్ ఇంజనీరింగ్'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు కాకినాడలో యోగా ఇన్నర్ ఇంజనీరింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.నగరంలోని కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రాచీన యోగశాస్త్రాల సారాంశమైన ఇన్నర్ ఇంజనీరింగ్ మనిషి సంపూర్ణ శ్రేయస్సుకు బాటలు వేసి ఆనందకరమైన జీవితానికి దోహదపడుతుందన్నారు. రామకృష్ణారావుపేటలోను, వెంకటరత్నపురం గాంధీభవన్‌లోను ప్రతిరోజూ ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతుందన్నారు. 10వ తేదీ సాయంత్రం పరిచయ కార్యక్రమం ఉంటుందని, ఆసక్తిగల వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 96181 18529 నెంబరును సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

రూ.1.11 లక్షలు పలికిన గణపతి లడ్డూ



రూ.1.11 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్న వీరబాబు

యానాం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యానాం పిల్లారాయవీధిలో కొలువైన శ్రీపిళ్లైయ్యార్ స్వామి (లక్ష్మీగణపతి) నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు ఏర్పాటు చేసిన లడ్డూకు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. 54 కిలోల లడ్డూను రూ.1.11లక్షలకు వీరబాబు(మసాల) కైవసం చేసుకున్నాడు. స్థానిక త్యాగరాయవీధిలోని శ్రీశివరాజ విద్యాగణపతికి పెన్నులతో పూజ నిర్వహించారు. పూజల అనంతరం పెన్నులను విద్యార్థులకు పంపిణీ చేశారు.

అవంతినగర్‌లో రూ.1.05 లక్షలు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం శివారు అవంతినగర్‌లో ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్ధి, బుద్ధి గణపతి మండపంలో స్వామివారికి 45 కిలోల లడ్డూ సమర్పించారు. శుక్రవారం నిర్వహించిన వేలంలో కాలనీవాసులు దానిని రూ.1.05 లక్షలకు సొంతం చేసుకున్నారు.అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, జనసేన సీనియర్ నాయకులు మాదారపు తాతాజీ, శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



లడ్డూను సొంతం చేసుకున్న అవంతీనగర్ వాసులు

10న 'ఈషా' యోగా పరిచయ కార్యక్రమం

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యోగాతో భావోద్వేగాల నియంత్రణ, మానసిక ప్రశాంతతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందేలా ఇన్నర్ ఇంజనీరింగ్ పేరుతో సద్గురు ఓ కార్యక్రమం రూపొందించారు.ఈ కార్యక్రమం తిరుపతి, గుంటూరు, కాకినాడ, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, కడప కేంద్రాల్లో తెలుగులో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 21 నిమిషాల శాంభవి మహాముద్ర క్రియ చేయడం ద్వారా లక్షల మంది ఎన్నో ప్రయోజనాలను పొందారు. దీనికి సంబంధించిన వివరాల కోసం ఈ నెల 10న జరిగే ఉచిత పరిచయ కార్యక్రమానికి హాజరుకావాలని ఈషా ఫౌండేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. isha.co/ieapt లేదా 04041896666 నంబరులో సంప్రదించాలని సూచించింది.

మరిడమ్మకు స్వర్ణ పుష్పార్చన

పెద్దాపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురంలోని మరిడమ్మ దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక వేదికపై అమ్మవారిని అధిష్ఠింపజేసి వేద పండితుల పవిత్ర మంత్రోచ్చారణల నడుమ బంగారం, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి, సిబ్బంది రమణ, వేద పండితులు, ఆసాదులు, భక్తులు పాల్గొన్నారు.

10న జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలను ఈ నెల 10వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహిస్తామని జిల్లా పరిషత్ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత స్థాయీ సంఘాల సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాలని సీఈవో శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

అంచనాలకు ఆమోదం..

- అన్నవరం దేవస్థానంలో కార్తీకమాస పనులపై పాలకమండలి సమావేశం
- రూ.5.13 కోట్లతో గ్రావెల్‌రోడ్డు, వన్‌వే, పార్కింగ్ సౌకర్యాలకు అంచనాలు
- రూ.5.25 లక్షలతో తాత్కాలిక మరుగుదొడ్లు
- రూ.10 లక్షలతో వాటర్‌ప్రూఫ్ షామియానాలు ఏర్పాటు
- గిరి ప్రదక్షిణకు రూ.7.70 లక్షలతో పనులు
- తెప్పోత్సవానికి రూ.5.50 లక్షలతో వివిధ పనులకు చైర్మన్ గ్రీన్‌సిగ్నల్

అన్నవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ఈ ఏడాది కార్తీకమాసంలో భక్తుల రద్దీ దృష్ట్యా చేపట్టాల్సిన సౌకర్యాలు, ఇతర అవసరాల ప్రధాన అజెండాలుగా శుక్రవారం నిర్వహించిన పాలకమండలి సమావేశంలో చైర్మన్ రోహిత్ ఆమోదం తెలిపారు. ప్రధానంగా రూ.5.13 కోట్లతో హరిహర మార్గ్ పార్కింగ్, వన్‌వేగా హరిహరసదన్ వెనక నుంచి సత్యగిరి జంక్షన్‌కు వన్‌వేగా ఆదిశంకర్ మార్గ్ మీదుగా కొండదిగువకు వెళ్లేందుకు అవసరమైన గ్రావెల్ రోడ్డు వేయడానికి తయారుచేసిన అంచనాలకు చైర్మన్ ఆమోదం తెలిపారు. కార్తీకపౌర్ణమి రోజున లక్షలాది భక్తులు గిరిప్రదక్షిణకు విచ్చేయనున్న నేపథ్యంలో స్టాల్స్ ఏర్పాటు, పలుచోట్ల టెంట్‌లు, షామియానాలు, టాయిలెట్ల ఏర్పాటుకు రూ.7.70 లక్షల అంచనా పనులకు ఆమోదం లభించింది. క్షీరాబ్ది ద్వాదశిరోజున స్వామివారి తెప్పోత్సవం జరగనున్న నేపథ్యంలో రూ.5.50 లక్షలతో వివి పనులు చేపట్టేందుకు, రూ.5 లక్షలతో పడమర రాజగోపురం వద్ద షెడ్లు, గ్రీన్ మ్యాట్, హోల్డింగ్ పాయింట్ల ఏర్పాటుకు, రూ.10 లక్షలతో రూ.2వేలు, రూ.1500 వ్రతమండపాల వద్ద వెయిటింగ్ హాల్స్, వాటర్ ప్రూఫ్ షామియానాల ఏర్పాటుకు తయారుచేసిన అంచనాలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. రూ.28 లక్షలతో కొండదిగువ పవర్ హౌస్ నుంచి కొండపైకి విద్యుత్ సరఫరా కోసం అండర్‌గ్రౌండ్ కేబుల్ ద్వారా రెండో లైన్ ఏర్పాటుకు, రూ.11.50 లక్షలతో అన్నవరం దత్తత దేవాలయమైన బలిఘట్టం సత్యదేవుడి ఆలయంలో వివిధ అభివృద్ధి పనులకు, రూ.5.25 లక్షలతో వివిధ ప్రాంతాల్లో 22 తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటుకు, రూ.4.50 లక్షలతో పాత, కొత్త సెంటినరీ కాటేజీల వద్ద స్విచ్‌బోర్డుల ఏర్పాటు తదితర పనులను ఆమోదించారు. ఇటీవల పలు వ్యాపార లైసెన్స్ హక్కుల కోసం నిర్వహించిన బహిరంగవేలంలో హెచ్చుపాటలను, దేవస్థానానికి అవసరమైన పనులకు లోయెస్ట్ టెండర్లు ఆమోదించారు. సమావేశంలో ఈవో సుబ్బారావు, అన్ని విభాగాల ఏఈవోలు, సూపరెంటెండెంట్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కార్తీకమాస ఏర్పాట్లపై సమీక్ష



అన్నవరంలో కార్తీకమాస ఏర్పాట్ల సమీక్షలో పాల్గొన్న ఈవో, చైర్మన్

అన్నవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో సత్యదేవుడి సన్నిధికి అసంఖ్యాకంగా విచ్చేసే భక్తులకు చేపట్టాల్సిన సౌకర్యాలపై ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఈ ఏడాది కార్తీకమాసంలో 13 రోజులు పర్వదినాలుగా, మిగిలిన రోజులు సాధారణ రోజులుగా గుర్తించారు. పర్వదినాల్లో రోజుకు లక్షపైబడి, సాధారణ రోజుల్లో సుమారు 50వేలమంది భక్తులు విచ్చేస్తారని అంచనా వేశారు. భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా వ్రతం, దర్శనం త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఈవో సూచించారు. పర్వదినాల్లో ఒంటిగంట నుంచి వ్రతాలు, 2గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించాలని నిర్ణయించారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా, గతేడాది తప్పిదాలు పునరావృతం కాకుండా చూడాలని చైర్మన్ రోహిత్ సూచించారు. సెక్యూరిటీ నిత్యం అప్రమత్తంగా ఉండాలని, భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ఇంజనీరింగ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీలు



కాకినాడలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

జీజీహెచ్(కాకినాడ) సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాధారణ ప్రసవాలు, సిజేరియన్ ప్రసవాలు ఎన్ని జరుగుతున్నాయి, ఏ విధంగా జరుగుతున్నాయి అనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శుక్రవారం కాకినాడలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీలతో కూడిన ఆడిట్ నిర్వహించారు. కోనసీమ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు ఆధ్వర్యంలో కాకినాడలోని డాక్టర్ వీర్రాజు హాస్పటల్, భాను నర్సింగ్ హోం, సన్‌రైజ్ హాస్పటల్, టీమ్ హాస్పటల్, అమృత మదర్ అండ్ చైల్డ్ హాస్పటల్‌లలో ఆడిట్ నిర్వహించారు. ప్రైవేటు హాస్పటల్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా సిజేరియన్ ప్రసవాలను ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాధారణ ప్రసవాలను పెంచాల్సిన అవసరం చాలా ఉందని సూచించారు. తొలి కాన్పులో సాధారణ ప్రసవ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏ విధంగా ఉంటాయో అనే విషయాలను ఆసుపత్రులకు వచ్చే గర్భిణులు, కుటుంబ సభ్యులకు తెలియజేయాలని ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులకు సూచించారు. అలాగే కాకినాడ డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ బృందం కోనసీమ జిల్లాలో ఆడిట్ నిర్వహించింది. కాకినాడలో చేసిన ఆడిట్‌లో డీఐవో డాక్టర్ బివివి సత్యనారాయణ, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ భరత్‌లక్ష్మి, ఎస్‌వో కె.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి హత్య

- విడాకులు తీసుకుని కుమార్తె పెళ్లి కోసం కలిసిన జంట
- భర్తకు వేరే మహిళతో వివాహేతర సంబంధం
- రోజూ మద్యం మత్తులో వీడియో కాల్స్
- కోపంతో భర్త తలపై ఇనుపరాడ్‌తో బలంగా కొట్టి చంపిన భార్య

వివాహమై ఆడబిడ్డ పుట్టిన తరువాత భార్యాభర్తలిద్దరికీ పొసగలేదు. దాంతో విడాకులు తీసుకుని విడిపోయారు. కానీ కుమార్తె పెళ్లిలో కన్యాదానం కోసం పెద్దల మాట విని మళ్లీ కలుసుకున్నారు. అయితే భర్త రోజు రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకుని వేరే మహిళకు వీడియో కాల్ చేసి మాట్లాడుతున్నాడనే కోపంతో అర్ధరాత్రి కిరాతకంగా కొట్టి చంపింది భార్య. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నడిపూడిలో జరిగింది.

అమలాపురం రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం నడిపూడి గ్రామం బైపాస్ రోడ్డులో మెట్ల రాంజీ కాలనీలో డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ కల్యాణ మండపం సమీపంలో దొమ్మేటి రాంబాబు (61), భార్య వెంకటరమణతో సొంతింట్లో జీవించేవాడు. రాంబాబు కాకినాడ హెడ్ క్వార్టర్ స్క్వాడ్‌లో ఆర్టీసీ బస్సుల తనిఖీ అధికారిగా పనిచేస్తున్నాడు. రాంబాబు, వెంకటరమణ కాపురం కొంతకాలం సజావుగానే సాగింది. వారికి కుమార్తె హేమ జన్మించింది. భార్యాభర్తల మధ్య విబేధాలు రావడంతో విడాకులు తీసుకుని విడిపోయారు. హేమ తండ్రి వద్దనే ఉంది. విడిపోయిన భార్య వెంకటరమణ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లి కొంతకాలం పనిచేసుకుని తిరిగి స్వదేశానికి చేరుకుంది. కాలక్రమంలో కుమార్తె హేమకు పెళ్లి చేయాలని పెద్దలు నిర్ణయించారు. దాంతో విడిపోయిన భార్యభర్తలు కలిసి కన్యాదానం చేయించాల్సిన పరిస్థితిపై రాంబాబు కుటుంబసభ్యులు చర్చించుకున్నారు. దాంతో పెద్దల సమక్షంలో కలిసి కుమార్తె వివాహాన్ని జరిపించారు. కుమార్తె నరాల హేమ కుటుంబం ప్రస్తుతం చెన్నైలో జీవిస్తున్నారు.

ఒకే ఇంట్లో ఉన్నా కానీ...

ఈ నేపథ్యంలో విడిపోయిన భార్యాభర్తలు తిరిగి కలుసుకున్నప్పటికీ ఒకే ఇంట్లో దూరంగా ఉంటున్నారు. రాంబాబు భోజనాన్ని కూడా బయట నుంచి తెచ్చుకుని తినేవాడు. అతడు గత కొంతకాలంగా మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. రోజు రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకుని వేరే మహిళకు వీడియో కాల్ చేసి మాట్లాడుతున్న తీరుపై వెంకటరమణ కక్ష పెంచుకుంది. గురువారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న రాంబాబు 12 గంటల వరకు ఫోన్‌లో మాట్లాడినట్టు చెప్తున్నారు. ఆ తరువాత మద్యం మత్తులో మంచంపై పడి ఉన్న రాంబాబును భార్య వెంకటరమణ ఇనుపరాడ్‌తో తలపై బలంగా మోదడంతో చనిపోయాడు. శుక్రవారం ఉదయం బంధువులకు ఫోన్ చేసి గుండెపోటుతో రాంబాబు మృతి చెందినట్టు భార్య సమాచారం ఇచ్చింది. నడిపూడి చేరుకున్న బంధువులు మృతదేహం పడి ఉన్నతీరు, మంచం నిండా రక్తం మరకలు గుర్తించి వెంటనే తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. తాలూకా సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ వై.శేఖర్‌బాబు సిబ్బందితో కలిసి శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో భార్య వెంకటరమణ తలపై ఇనుపరాడ్‌తో బలంగా మోదడం వల్లే రాంబాబు మృతిచెందినట్టు గుర్తించారు. రావులపాలేనికి చెందిన మృతుడికి కుమారుడు వరుసైన దొమ్మేటి నాగసురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అయితే ఇది ఒక్కరి పనేనా అన్న కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని శవపంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు తాలూకా ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.



రాంబాబు మృతదేహం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

ప్రభుత్వం తక్షణం పీఆర్సీ కమిటీని నియమించాలి

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామసూర్యనారాయణ



మాట్లాడుతున్న రామసూర్యనారాయణ

అమలాపురం రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేసేందుకు వెనుకాడబోనని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాశీభట్ల రామసూర్యనారాయణ హామీ ఇచ్చారు. ప్రభుత్వం తక్షణం పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు మధ్యంతర భృతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు బకాయి పడ్డ డీఏలు, ఎరెండ్ లీవ్స్ బకాయిలు విడుదల చేయాలన్నారు. జిల్లాశాఖ అధ్యక్షుడు మద్దాల బాపూజీ అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం కొంకాపల్లి ఏవీఆర్ నగర్‌లోని జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం ఉద్యోగులారా.. రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించగా రామసూర్యనారాయణ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు రూ.25వేల కోట్లకు చేరాయన్నారు. ప్రతీ నెల 1న ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని గత ప్రభుత్వంలో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినందుకు తప్పుడు కేసులు పెట్టి నాతో పాటు కుటుంబ సభ్యులను సైతం వేధించారని, చివరకు హత్య చేసేందుకు కూడా ప్రయత్నించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడానికి చొరవ తీసుకుని బకాయిలు ఎంతో ముందు లెక్క తేల్చాలన్నారు. వాటికి చట్టబద్ధత కల్పించే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మల్లిబాబు, కోశాధికారి జేఏ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.విజయ్‌కుమార్, కొప్పిశెట్టి వెంకటగణేష్, సహ కార్యదర్శి పి.శివకుమార్, పెన్షనర్ల సంఘ నాయకుడు కేకేవీ నాయుడు, ఎస్టీవీఎస్ సీహెచ్ కృష్ణమూర్తి, పి.కామేశ్వరరావు, ఎం.శ్రీనివాస్, వి.సద్గుణరావు, ఎంవీవీఎస్ ప్రసాద్, కొమ్ముల స్వామినాయుడు, శ్రీమన్నారాయణ, వర్మ, పాండురంగారావు తదితరులు ఉన్నారు. వీఆర్వోల సంఘ ప్రతినిధులు ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.రామసూర్యనారాయణను కలుసుకుని వినతిపత్రం అందజేశారు. అర్హులైన గ్రేడ్-1 వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లు, గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్వోలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద పదోన్నతులు కల్పించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. వీఆర్వోల సంఘ జిల్లా అధ్యక్షుడు సాధనాల యెల్లేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు బాపూజీ పాల్గొన్నారు.

చెట్టుకు ఉరేసుకున్న యువకుడు

ఎటపాక, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగ్గా లేక ఆదివాసీ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం బానవాగు గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలోని పూసుపల్లి గ్రామానికి చెందిన కర్మామి జోగా (24) మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనెల 1న స్వగ్రామంలో కుటుంబసభ్యులతో గొడవపడి ఈ ప్రాంతానికి వచ్చాడు. రెండురోజుల క్రితం రాంగో పాలపురం జాతీయ రహదారిపై ఒంటి పై దుస్తులు లేకుండా తిరిగాడని చెప్తున్నారు. ఈ క్రమంలో బానవాగు సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సులభంగా డబ్బు సంపాదనకు దొంగతనాలు

- అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
- రూ.11,58,500 విలువైన ఆభరణాలు, రూ.2.80 లక్షల నగదు స్వాధీనం



రాజోలులో వివరాలు వెల్లడిస్తున్న రాజోలు సీఐ నరేష్‌కుమార్

రాజోలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.11,58,500 విలువచేసే 64 గ్రాముల బంగారం, 2కిలోల 859 గ్రాముల వెండి, రూ.2లక్షల 80వేల నగదును స్వాధీనం చేసుకున్నామని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్, అమలాపురం క్రైమ్ సీఐ ఎం.గజేంద్రకుమార్ తెలిపారు. రాజోలు పోలీసుస్టేషన్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో వారు నిందితుల వివరాలు వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం బి.సావరానికి చెందిన కె.అర్జున్ డిగ్రీ వరకు చదివి ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. మద్యానికి అలవాటు పడి సరైన సంపాదన లేక సులభంగా డబ్బు సంపాదించాలని దొంగతనాలు ప్రారంభించాడు. అర్జున్‌పై కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లాలో పదికి పైగా దొంతనాల కేసులు ఉన్నాయి. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం గొల్లగూడెనికి చెందిన ఎస్.మంగప్రసాద్ వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన షేక్ బాషీ వెండి పట్టీలు తయారుచేస్తూ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడిపై మారేడుమిల్లి పోలీసుస్టేషన్‌లో గంజాయి రవాణా చేసినందుకు కేసు నమోదైంది. కాకినాడకు చెందిన షేక్ అజీజ్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేసేవాడు. అయితే ఈ నలుగురు మద్యం, విలాసాలకు అలవాటు పడి వచ్చే ఆదాయం సరిపోక సులభంగా డబ్బు సంపాదించాలని దొంగతనాలు చేశారు. ఈ నలుగురిని రాజోలు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. కోనసీమ జిల్లా ఎస్పీ బీవీ కృష్ణారావు ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ ఆధ్వర్యంలో రాజోలు సీఐ టీవీనరేష్‌కుమార్, అమలాపురం క్రైమ్ సీఐ ఎం.గజేంద్రకుమార్, సిబ్బంది, రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్, సిబ్బంది నిందితులను పట్టుకున్నారు. ముగ్గురిని రాజోలు మ ండలం బి.సావరంలో, ఒకరిని కాకినాడలో అరెస్టు చేశామని తెలిపారు. నిందితులకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో పరిచయం ఏర్పడిందని, తర్వాత ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. నిందితులను రాజోలు కోర్టులో హాజరుపరుచగా రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ నరేష్‌కుమార్, క్రైమ్ ఎస్ఐ గజేంద్రకుమార్, ఎస్ఐ పరదేశీ, ఏఎస్ఐ బాలకృష్ణ, ఎస్ఐ బి.రాజేష్‌కుమార్, క్రైమ్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

చిట్టీల వ్యాపారి రూ.40 కోట్లకు కుచ్చుటోపీ

కుటుంబంతో సహా పరారీ, కేసు నమోదు



వీరశంకరరావు కుటుంబం

ఐ.పోలవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్లలో చిట్టీల వ్యాపారి సుమారు రూ.40కోట్లకు ఎగనామం పెట్టి పరారయ్యాడు. బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఐ.పోలవరం మండలంలోని పశువుల్లంక గ్రామానికి చెందిన చింతలపూడి వీరశంకరరావు గత కొన్నేళ్లుగా మురమళ్ళ, ముమ్మిడివరం, కాకినాడ తదితర ప్రాంతాల్లో చిట్టీల పేరుతో వ్యాపార లావాదేవీలు నిర్వహించేవాడు. అయితే సభ్యులకు సొమ్ము చెల్లించకుండా సుమారు రూ.40కోట్లకు ఎగనామం పెట్టి కుటుంబంతో సహా పరారైనట్టు బాధితులు ఐ.పోలవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరశంకర్రావు లక్ష నుంచి రూ.కోటి వరకు చిట్టీలు నిర్వహించేవాడు. గత కొన్ని రోజుల క్రితం కుటుంబంతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.రవీంద్రబాబు తెలిపారు. శుక్రవారం బాధితులు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును కలిసి తమకు జరిగిన మోసంపై మొరపెట్టుకున్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

మండపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడి రైల్వే స్టేషన్‌లో గురువారం రాత్రి 11 గంటల సమయంలో రైలు ఢీకొని యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారపూడి పంచాయతీ పరిధిలోగల వేములపల్లి బంగారమ్మ కాలనీకి చెందిన మానేపల్లి లక్ష్మణ్ (16) గురువారం రాత్రి 11గంటల సమయంలో రైలు ఢీకొని మరణించాడు. శుక్రవారం లక్ష్మణ్ మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సంఘటనపై రాజమహేంద్రవరం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ దొంగల ముఠా అరెస్ట్

12 వాహనాల స్వాధీనం



బైక్ దొంగలను పట్టుకున్న కోరుకొండ పోలీసులు

కోరుకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా ఇంటి ముందు పార్కు చేసిన బైక్‌లను పట్టుకుపోతున్న దొంగల ముఠాను కోరుకొండ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వారి నుంచి 11 స్కూటీలు, ఒక స్ప్లెండర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాదరాడ గ్రామానికి చెందిన ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కోరుకొండ పోలీస్‌స్టేషన్ వద్ద నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ వివరాలను మీడియాకు వెల్లడించారు. గాదరాడకి చెందిన అల్లాడి విజయ్‌కుమార్ పాత నేరస్తుడు. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాడు. మద్యం, జూదానికి బానిసై బైక్‌లు దొంగతనాలు చేస్తున్నాడు. కోరుకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2 బైక్‌లు, రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో 4 బైక్‌లు, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, సీతానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, ప్రకాష్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు వెరసి 12 బైక్‌లు దొంగిలించాడు. విజయ్‌కుమార్, వనుం సురేష్, వనుం లోవరాజు బైక్ దొంగతనాల్లో భాగస్తులు. సీఐ వై.సత్యకిషోర్‌కు వచ్చిన సమాచారం మేరకు ఈ ముగ్గురిని శుక్రవారం ఎస్ఐ నాగార్జున, సిబ్బంది గాదరాడ గ్రామ శివారులో అదుపులోకి తీసుకుని బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ నాగార్జున, హెచ్‌సీ శ్రీను, కానిస్టేబుల్స్ పవన్ వరప్రసాద్, బాపినాయుడులను అభినందించారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

బాధిత మహిళకు బంగారు ఆభరణాల అందజేత



మహిళకు బంగారు ఆభరణాలను అందజేస్తున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మణికుమార్

పిఠాపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రికవరీ చేసిన బంగారు ఆభరణాలను బాధిత మహిళకు పిఠాపురం పోలీసులు శుక్రవారం అందజేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం కుంతీమాధవస్వామి గుడి వీధిలో నివాసముంటున్న ఆశా కార్యకర్త కృష్ణవేణికి చెందిన బంగారు ఆభరణాలు గతేడాది సెప్టెంబరులో చోరీ అయ్యాయి. రూ.5లక్షలు విలువైన బంగారు నగలు చోరీపై పిఠాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆధునిక సాంకేతిక పద్ధతులు అనుసరించి హైదరాబాద్‌కు చెందిన సోమరాజు, సుమంత్ ఈ చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. వారిని విచారించగా హైదరాబాద్‌లోని ఓ బస్టాండులో బ్యాగు, అందులో ఉంచిన బంగారు ఆభరణాలను చోరీ చేసినట్టు తెలిపారు. వారి వద్ద ఉన్న 4 బంగారు గాజులు, చైను, పుస్తెల తాడు, 2 ఉంగరాలు వెరసి 80 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టు అనుమతితో బాధితురాలికి శుక్రవారం సదరు ఆభరణాలను పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ మణికుమార్ అందజేశారు. తన ఆభరణాలను తిరిగి అప్పగించిన సీఐ, ఎస్ఐను కృష్ణవేణి, ఆమె కుటుంబసభ్యులు ఘనంగా సత్కరించారు.

ప్రకృతి వ్యవసాయంతో మంచి ఫలితాలు

మామిడికుదురు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి ఎస్వీ సత్యనారాయణ సూచించారు. ఈదరాడ పీఆర్సీ సెంటర్‌లో జీవామృతం, మీనామృతం తయారీని శుక్రవారం మహిళా ప్రకృతి వ్యవసాయ రైతులు తయారుచేశారు.

నవభారత నిర్మాతలు ఉపాధ్యాయులే

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- అవార్డులు స్వీకరించిన టీచర్లు





అమలాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం, అమలాపురంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన అబూజీ, పి.గన్నవరం సాయితేజ పబ్లిక్‌స్కూల్లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సమాజానికి దిశానిర్దేశకుడు గురువేనని, సమాజంలో గురువును మించిన దైవంలేదని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం సాయితేజ పబ్లిక్‌స్కూల్లో శుక్రవారం జరిగిన గురుపూజోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీశాఖ ఐటీ సలహాదారుడు పెనుమారెడ్డి నాగబాబు, నగరం ఏంఎసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, పాఠశాల డైరెక్టర్లు హనుమాన్, రాణి, ప్రధానోపాధ్యాయుడు సుంకర వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.పి.గన్నవరం హైస్కూల్లో గురువారం సాయంత్రం అన్నా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐఈ కుమార్, మమత స్వచ్ఛందసేవా సమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో జరిగిన గురుపూజోత్సవం కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికచేసిన 60మంది ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సన్మానించారు. హెచ్‌ఎం ఉమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అన్నామినిస్ట్రీస్ అధ్యక్షుడు డేనియల్‌పాల్, స్కూలు కమిటీ చైర్మన్ నల్లా శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నల్లా బాలజీ, వరిగేటి రత్నం, గూటం రత్నం రాజు, నక్కా ప్రసాద్‌పాల్గొన్నారు.

అమలాపురం రూరల్/టౌన్,(ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని అమలాపురం పట్టణ పరిసర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. అమలాపురం లయన్స్ క్లబ్ హాలులో క్లబ్ అధ్యక్షుడు సూదా గణపతి ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయుడు సీహెచ్ సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు సీహెచ్ ఫణికుమార్, ఎం.వెంకటరమణ, వి.రవికుమార్‌లను ఘనంగా సత్కరించారు. ఎస్.అనిల్‌కుమార్‌శేఠ్, జోన్‌చైర్‌పర్సన్ పీవీ సంధ్యారాణి, కార్యదర్శి బెహరా హనుమంతరావు, కోశాధికారి గుత్తుల నాగేశ్వరరావు, జంపన సుమన్‌వర్మ తదితరులు పాల్గొన్నారు. సలాం ఆసుపతి అధినేత అబూజీ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించగా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, డాక్టర్ షానవాజ్, కౌన్సిలర్ బొర్రా చిట్టిబాబు, రాష్ట్ర హ్యాండీ క్రాఫ్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్డీఎస్ ప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. యర్రమిల్లి పాండురంగారావు, బందా ఆర్.కామేశ్వరరావు, మన్యం మాష్టారు, చింతా రామారావు, బొక్కా రామకృష్ణ, పీఎస్ శిరోమణి, కొప్పిశెట్టి వెంకటేశ్వర్లు, బీఎన్ వెంకటేశ్వరరావులను ఉత్తమ ఉపాధ్యాయులుగా సత్కరించారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని రాధాకృష్ణన్ చిత్రపటానికి స్థానిక తులిప్స్ స్కూలులో డైరెక్టర్ నెల్లి రమేష్, ప్రిన్సిపాల్ నెల్లి సవిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు పంచెకట్టుతో, విద్యార్థినులు చీరలు కట్టుకుని సంప్రదాయబద్ధ ఉపాధ్యాయులుగా కనువిందు చేశారు. పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అమలాపురం శ్రీవెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కేఎస్‌వీఎన్ మనోహర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహారావు, వైస్‌చైర్మన్ కరాటం ప్రవీణ్, ఎండీ కె.శ్రావణ్ దిలీప్, చోడే జాన్‌పాల్, యాలంగి వరప్రసాద్, మల్లిపూడి విజయలక్ష్మి, కె.హేమవిజిత తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి):ముక్తేశ్వరం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిమ్మకాయల గణేశ్వరరావుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పరిష్కారం లభించింది. శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగిన ఉపాధ్యాయ వేడుకల్లో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, డీఈవో షేక్ సలీం బాషా నుంచి ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, సిరిపల్లి సర్పంచ్ కుడుపూడి శాంతావతి, అయినవిల్లి సర్పంచ్ కాకర శ్రీనివాస్, తొత్తరమూడి సర్పంచ్ వార జయరాం సావిత్రి, ఎంపీటీసీ యడ్ల కిరణ్ బాబు, పాఠశాల కమిటీ చైర్మన్ యడ్ల లక్ష్మీదుర్గ, మెంబర్లు, ఉపాధ్యాయులు, నేరేడుమిల్లి సత్యనారాయణ, సలాది పుల్లయ్యనాయుడు, గుబ్బల సాయిశ్రీనివాస్‌లు ఆయన్ను అభినందించారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అమలాపురం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ నుంచి ఇసుకపూడి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఏఎల్ వరప్రసాద్, తొండవరం పాఠశాల ఉపాధ్యాయుడు కందాల నరసింహం, అంబాజీపేట కొర్లపాటివారిపాలానికి చెందిన ఉపాధ్యాయురాలు సీహెచ్.శ్యామలకుమారిలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. వారికి ఎస్టీయూ, యూటీఎఫ్ నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును మామిడికుదురుకు చెందిన మట్టా నాగరాజు శుక్రవారం కలెక్టర్ నుంచి అందుకున్నారు. అవార్డుతో పాటు మెమెంటో, ప్రశంతా పత్రం అందించి దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం,(ఆంధ్రజ్యోతి): స్థానికఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లాఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు కె.ధర్మారావు, వై.భాస్కర శాస్త్రి, మండల ఉత్తమ ఉపాధ్యాయులు ఆశపు ఉష(గోకనవిల్లి), సబ్బితి ఝాన్సీరాణి(కామరాజుచెరువు), వై.శ్రీనివాస్(మధురవారిపేట), అడబాల శ్రీదేవి(కిత్తనచెరువు), డి.నాగశ్రీనివాస్(సూదాపాలెం), పీవీ గోపాలం(బొండాడిపేట)ను సన్మానించారు. మండలంలో 12ఉత్తమ పాఠశాలలకు రోలింగ్‌షీల్డ్ బహూకరించారు. బదిలీపై వెళ్లిన ఎంఈవో కిరణ్‌బాబునుసన్మానించారు.ఎంపీడీవో భూపతిరాజు తులసీకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు ఎన్.వీరశంకరరావు, సత్తి సత్యకృష్ణ, జడ్పీటీసీ గెద్దం సంపదరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, వైస్‌ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, ఉపాధ్యాయసంఘాల నాయకులు గుత్తుల సుబ్రహ్మణ్యం, చిక్కం మైనర్‌బాబు, వై.శ్రీనివాస్, గెద్దం సురేష్‌బాబు, సర్పంచ్‌లు జొన్నాడ శ్రీదుర్గాచిన్ని, యర్రంశెట్టి రామచంద్రరావు, పెయ్యల రాజ్‌కుమార్, జిన్నూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు వంగా గిరిజానాగకుమారి, దేశంశెట్టి నాగరత్నకుమారి, నాగులపల్లి శేషవేణి పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో ఉత్తమ సేవలకు రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డుకు ఒకరు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఇద్దరు ఎంపికైనట్టు ఎంఈవో కిశోర్ కుమార్ తెలిపారు. శుక్రవారం అమలాపురంలో అంతర్వేదిపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మధ్యస్కూలు హిందీ స్కూలు అసిస్టెంట్ మహమ్మద్ తాహిర్‌పాషా, కొత్తలంక ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొల్లు రమాసత్యనారాయణలు కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి):మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీకళాశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని బీఏవిభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అధ్యాపకులను విద్యార్థులను దుశ్శాలువాలుకప్పి పండ్లతో సత్కరించారు.ప్రిన్సిపాల్ ఆనందమహానీ, సత్యనారాయణ, వీటీకే ప్రసాద్, సూర్యనారాయణరాజు, రమేష్‌బాబు, ప్రభాకర్, వీరాంజనేయులు, రామకృష్ణంరాజు, శ్రీనివాస్‌పాల్గొన్నారు.

వలీబాబా దర్గా వద్ద దీపారాధన



వలీబాబా దర్గా వద్ద దీపారాధన నిర్వహిస్తున్న భక్తులు

ముమ్మిడివరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం కొత్తలంక వలీబాబా 78వ ఉరుసు మహోత్సవాల్లో భాగంగా శుక్రవార దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి హిందూ-ముస్లిం భక్తులు తరలివచ్చి బాబా దర్గాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం ఉదయం దర్గా వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో కొవ్వొత్తులు, ప్రమిదలతో దీపాలు వెలిగించి దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. బాబాకు ప్రసాదాన్ని సమర్పించి భక్తులకు వితరణగా ఇచ్చారు. దర్గా నిర్వాహకులు ముజావర్ గేదెల రఘునాథబాబా, ముజావర్ ఆలీ ఆధ్వర్యంలో బాబా దర్గా వద్ద ఉరుసు మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు ఉచిత వసతి, భోజనం, మంచినీరు వంటి సౌకర్యాలు కల్పించారు. ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తా: ఎమ్మెల్యే దేవ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు నున్నవారి బాడవ, పల్లిపాలెం ఏటిగట్టు ఏరియాలో ఉన్న సమస్యలపై శుక్రవారం ఆయన క్షేత్రస్థాయి పరిశీలన చేసి సమస్యల పరిష్కారానికి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగాఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ రాజోలు నున్నవారి బాడవ, పల్లిపాలెం ఏటిగట్టు ఏరియాల్లో అనేక సమస్యలు నా దృష్టికి వచ్చాయన్నారు. ప్రజలు ప్రస్తావించిన ప్రతీ సమస్యను పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 263 కేవీ ట్రాన్స్‌ఫార్లను నెలాఖరులోగా ఏర్పాటు చేస్తానని తెలిపారు.తాగునీరు శివారు ప్రాంతాలకు అందేవిధంగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గోదావరి సెంట్రల్ ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ కడలి శ్రీదుర్గ, సర్పంచ్ రేవు జ్యోతి, ఉపసర్పంచ్ పామర్తి రమణ, సూరిశెట్టి శ్రీనివాస్, చాగంటి స్వామి, కాట్నరాజు, తహశీల్దార్ సీహెచ్ భాస్కర్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీగణపతి తెప్పోత్సవం



గోదావరిలో విహరిస్తున్న స్వామివారు

యానాం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యానాంలో గణనాధుని నవరాత్ర మహోత్సవాలు చివరిరోజు మంగళవారం గణనాథుల విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. స్థానిక రాజీవ్‌గాంధీ బీచ్‌లోని భారతమతవిగ్రహం సమీపంలోని జెట్టి వద్ద నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేశారు. గణనాథుల నిమజ్జనాలపె పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ వివిధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో పటిష్ఠభద్రత ఏర్పాట్లుచేయాలని అధికారులను ఆదేశించారు.

గోదావరిలో తెప్పోత్సవం:స్థానికపిల్లారాయ వీధిలో కొలువైన శ్రీపిళ్ళైయ్యార్‌స్వామి (లక్ష్మీ గణపతి) నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు శుక్రవారం తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు నిర్వహించారు. సాయంత్రం యానాం అగ్నికుల క్షత్రియ సంక్షేమ సేవా సంఘం ఉత్సవదారులుగా ఉన్న తెప్పోత్సవంపై స్వామివారు విహరించారు. తొలుత ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గౌతమి గోదారిలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన తెప్పోత్సవంపై ఉత్సవ విగ్రహాలను ఆశీనులుగావించి పూజలు నిర్వహించారు.పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి సతీమణి ఉదయలక్ష్మీ, ఆర్ఏ అంకిత్ కుమార్, డీటీ జ్యోతి వెంకటేశ్వరరావు, సంఘ ప్రతినిధులు మల్లాడి శామ్యూల్, శేరు కృష్ణ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

ఏషియన్ ఎచీవర్స్‌లో విశ్వకు చోటు



అమలాపురం టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏషియన్ అడ్మిరబుల్ అచీవర్స్-2025పుస్తకంలో అమలాపురానికి చెందిన అధ్యాపకుడు డాక్టర్ యెనుముల విశ్వకనకం చోటు దక్కించుకున్నారు. ఆసియా స్థాయిలో వివిధ విభాగాల్లో పరిశోధకులను గుర్తించి వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను పరిగణనలోనికి తీసుకుని ఏషియన్ అచీవర్స్‌గా గుర్తించారు. జపాన్, కొరియా తదితర దేశాలకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలతో పాటు రాష్ట్రం నుంచి విశ్వకనకంకు చోటు కల్పించారు. కోనసీమలోని వివిధ రకాల మొక్కలపై విశ్వకనకం చేసిన పరిశోధనకు పిహెచ్‌డీ తీసుకున్నారు. అంతేకాకుండా ఎందో విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దారు. ఢిల్లీలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో మెడల్‌ను అందజేశారు. విశ్వకనకం ప్రస్తుతం రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోటనీ అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

గంగారావు మాస్టారు విగ్రహావిష్కరణ

రాజోలు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): చింతలపల్లిలో విశ్రాంత ఉత్తమ ఉపాధ్యాయుడు, రెడ్‌క్రాస్ అవార్డు గ్రహీత గుబ్బల గంగారావు మాస్టారు జ్ఞాపకార్థం ఆయన శిష్యులు ఏర్పాటుచేసిన ఆయన విగ్రహాన్ని శుక్రవారం మాజీ డిప్యూటీ స్పీకర్ అల్లూరి వెంకటసూర్యనారాయణరాజు ఆవిష్కరించారు. దంతులూరి చంటిరాజు, పి.గన్నవరం వైఎస్ ఎంపీపీ చెల్లుబోయిన గంగాదేవి, హెచ్‌ఎం జానకీరామయ్య, దొంగ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఆధ్వర్యంలో హెల్త్‌వాక్



అమలాపురంలో హెల్త్‌వాక్‌ను ప్రారంభిస్తున్న ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ సుధాకర్‌రెడ్డి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎల్ఐసీ 69వ బీమా వారోత్సవాలను పురస్కరించుకుని అమలాపురం బ్రాంచి కార్యాలయం ఆధ్వర్యంలో చేపట్టిన హెల్త్ వాక్‌ను బ్రాంచి మేనేజర్ సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఎల్ఐసీ ఉద్యోగులు, డెవలెప్మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు హెల్త్ వాక్‌లో పాల్గొన్నారు. 69ఏళ్ల కాలంలో ఎల్ఐసీ సాధించిన విజయాలు, ఎల్ఐసీ నూతన పథకాలను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. శాటిలైట్ బ్రాంచి మేనేజర్ కుమార్, ఏబీఎం మధుబాబు, డెవలెప్మెంట్‌ఆఫీసర్లు రమేష్‌బాబు ఎం.సుబ్రహ్మణ్యం, దుర్గాప్రసాద్, శ్రీకాంత్, శేషగిరిస్వామి, శ్రీరాములు, చక్రవర్తి, యూనియన్‌నాయకులు అర్జున్, వీరేంద్ర, జీవీవీ సత్యనారాయణ, ఏజెంట్లు ఎ.నాగేంద్రకుమార్, శ్యామ్‌బాబు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చెత్త రహిత పట్టణానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): చెత్త రహిత పట్టణంగా అమలాపురాన్ని తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగాసాహస్, వాష్ ఇనిస్టిట్యూట్ సంస్థల ఆధ్వర్యంలో పురపాలక సంఘ ప్రతినిధులకు గ్రాండ్ పార్కులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పాల్గొన్నారు. వ్యర్థాల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, చైర్మన్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, శిక్షణ నిపుణులు వి.శశాంక్, ఎస్.రఘు, ఏంజెల్, అర్జున్‌ప్రసాద్‌పాల్గొన్నారు.

చదరంగంలో నవోదయ విద్యార్థుల ప్రతిభ

యానాం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రాలో నిర్వహించిన జాతీయ స్థాయి చదరంగం పోటీల్లో యానాం జవహర్ నవోదయ విద్యార్థులు ప్రతిభ సాధించారని ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.కీర్తి తెలిపారు. ఈపోటీల్లో పాల్గొన్న విద్యాలయ విద్యార్థి హెచ్.బూస్యేంద్రనాధ్‌రెడ్డి జాతీయ స్థాయి ప్రథమ స్థానం నిలవడంతో పాటు డిసెంబరులో త్రిపురలో జరిగే ఎస్‌జీఎఫ్ఐ (స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా)లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులతో పాటు వ్యాయమా ఉపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న, సింహాచలంలను అభినందించారు.



ఆయుధ పూజతో విజయదశమి ఉత్సవాలు ప్రారంభం



మహిపాలవీధిలో విజయదశమి ఉత్సవాలను ఆయుధ పూజతో ప్రారంభించిన రామదాసు వంశీకులు

అమలాపురంటౌన్, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): చెడీతాలింఖానా ఆద్యుడు అబ్బిరెడ్డి రామదాసు విగ్రహం వద్ద బేతాళపూజ (ఆయుధపూజ)తో దసరా ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అమలాపురం మహిపాలవీధిలో చెడీతాలింఖానాకు చారిత్రక నేపథ్యం ఎంతోఉంది. అబ్బిరెడ్డి వంశీకులు పూజా కార్యక్రమాలు నిర్వహించి అబ్బిరెడ్డి రామదాసు, నరసింహారావు, రామదాసు విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. చెడీతాలింఖానా 170వవార్షికోత్సవ లోగోను నిమ్మకాయల జగ్గయ్యనాయుడు ఆవిష్కరించారు. అక్టోబరు2న దసరా ఊరేగింపు సంబరాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి, తిక్కిరెడ్డి నేతాజీ, గంగుమళ్ల శ్రీనివాస్, అబ్బిరెడ్డి సురేష్, దూడల ఫణి, పలనాటి రమణ, కర్రి రాఘవ, తిక్కిరెడ్డి ఆదినారాయణ, నల్లా అజయ్, బండారు రామ్మోహనరావు, జంగా అయ్‌బాబు, నడింపల్లి వర్మ, ఆకుల ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

మామిడికుదురు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ముస్లింల ఆరాధ్య దైవం మహ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్ ఉన్‌నబీని శుక్రవారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. నగరం గ్రామంలోని ఈవేడుకలను ప్రారంభించి మొదలుపెట్టి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా మామిడికుదురులోని సున్నీ జామియా మసీదును వివిధరకాల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని మిలాద్ ఉన్‌నబీ శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు. మత ప్రబోధకులు తారిఖ్‌అన్వర్‌రజ్వీ మహ్మద్ ప్రవక్త జీవితచరిత్రను భక్తులకు వివరించారు. పలువురు కవులు కార్యక్రమంలో పాల్గొని తమ కవిత్వాల ద్వారా మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను తెలిపారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొని ముస్లిం భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ముస్లిం సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. కమిటీఅధ్యక్షుడు మసూద్ మొహిద్దీన్(బాజానీ), సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, అబ్దుల్‌కలాం, ముఖ్రం హుస్సేన్ పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలను అంబాజీపేట ముస్లింలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మసీదు వద్ద కమిటీ అధ్యక్షుడు ఎండీ రఫీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి పేదలకు విరాళాలు అందించారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

అప్పనపల్లి కాజ్‌వేపై మళ్లీ వరద

మామిడికుదురు,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి):గోదావరికి వరదతీవ్రత పెరుగుతుండడంతో అప్పనపల్లి కాజ్‌వేపై వరద చేరింది. నాల్గోసారి కాజ్‌వేపై వరద చేరడంతో లంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రూ.68వేలు పలికిన గణపతి లడ్డూ

ఉప్పలగుప్తం, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి):గొల్లవిల్లి శ్రీబాలభక్త గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శుక్రవారం స్వామిలడ్డూను వేలం వేశారు. గ్రామానికి చెందిన సలాది రామకృష్ణ రూ.68వేలకు లడ్డూను దక్కించుకున్నారు. ఉప్పలగుప్తంలో జరిగిన లడ్డూ వేలంలో రూ.14,500కు లడ్డూను గాలిదేవర సురేష్ దక్కించుకున్నారు. గొల్లవిల్లిలో మద్దింశెట్టి పార్వతి జ్ఞాపకార్థం సుబ్బరాజు కుమారుల ఆధ్వర్యంలో భారీఅన్నసమారాధన జరిగింది.

గణపతి లడ్డూ రూ.16వేలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ సుంకరవారి వీధిలో శ్రీవిజయగణపతి ఆలయం వద్ద శుక్రవారం గణపతి లడ్డూకు నిర్వహించిన వేలంలో అధిక ధర లభించింది. లడ్డూను రంబాల శంకరరావు రూ.16,600కు కైవసం చేసుకున్నారు. ఈసందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ శంకరరావును, అతని కుమారులను ఘనంగా సత్కరించారు. సురవరపు బాబూరావు, చిల్లూరి సుబ్రహ్మణ్యం, గణేశుల బ్రహ్మానందం, పోలిశెట్టి అయ్యన్న, బసవా శ్రీహరిబాబు, సుంకర సూరిబాబు, తాడాల వీరబాబు, పోలిశెట్టి కృష్ణ, మాదాల పరంకుశం, సుంకర కోటి, పెద్దిరెడ్డి సర్వేష్ పాల్గొన్నారు.

పద్మకు అభినందనలు

మలికిపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నాటక అకాడమీ డైరెక్టర్‌గా ఎంపికైన దిండి మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకురాలు బందెల పద్మను శుక్రవారం పలువురు నాయకులు ఆమె ఇంటి వద్ద కలిసి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దిండి సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, మాజీ సర్పంచ్ అన్నంనీడి పురుషోత్తమరావు, ఎం.శ్రీనివాస్, దేవ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'బాధితులకు న్యాయం చేయకపోతే ఉద్యమిస్తాం'

ఐ.పోలవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గం బి.కొత్తూరులో వినాయక నిమజ్జనానికి వెళ్తున్న దళితులపై దాడిచేసి గాయపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాలమహానాడు నాయకులు డిమాండ్ చేశారు. పాతయింజరం అంబేద్కర్ విగ్రహఆవరణలో శుక్రవారం మాల మహానాడు ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. బాధితులకు న్యాయం చేయకపోతే ఉద్యమిస్తామని నాయకులు హెచ్చరించారు. సమావేశంలో వడ్డి గౌతమ్, రెడ్డిబాబు, మట్టా గగనవీరుడు, ములపర్తి శ్రీను, సాధనాల బాబూరావు, పండు విజయ్, నాగాబత్తుల రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అంబాజీపేట, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట, గంగలకుర్రు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కె.రాంబాబు తెలిపారు. అంబాజీపేట, మాచవరం, వాకలగరువు, నందంపూడి, తొండవరం, పోతాయిలంక, సాకుర్రు, గున్నేపల్లి, గంగలకుర్రు పరిధిలోని కె.పెదపూడి, మొసలపల్లి, పాలగుమ్మి, నడిపూడి, బండారులంక గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం, నరేంద్రపురం సబ్‌స్టేషన్ల పరిధిలో 33-11 కేవీ లైన్లలో మరమ్మతులు నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి 2గంటలు వరకు విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ ఆచార్యులు తెలిపారు. నరేంద్రపురం, కుందాలపల్లి, జి.పెదపూడి, రాజులపాలెం, పి.గన్నవరం, లంకలగన్నవరం, నాగుల్లంక, మానేపల్లి, వాడ్రేవుపల్లి, ముంగండ, కె.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి, కె.ముంజవరం, ముంజవరపుకొట్టు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బాలబాలాజీ సన్నిధిలో మాస కల్యాణం



అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో మాసకల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

మామిడికుదురు, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో మాస కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భాద్రపద శుద్ధ త్రయోదశి శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని కల్యాణోత్సవాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. భక్తులు గోవింద నామస్మరణ నడుమ శ్రీదేవి భూదేవి శిరస్సులపై జీలకర్రా బెల్లం పెట్టి కల్యాణ క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సహాయకమిషనర్ వి.సత్యనారాయన-జయలలిత దంపతులు ప్రధాన కర్తలుగా పాల్గొనగా పలువురు భక్తులు కర్తలుగా పాల్గొని కల్యాణాన్ని కమణీయంగా నిర్వహించారు. స్వామివారి మూల విరాట్‌లకు పంచామృతాభిషేకాన్ని ఘనంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఊరేగింపులో డీజేలు ఏర్పాటు చేస్తే కేసు: డీఎస్పీ

అంబాజీపేట, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): గణనాథుల ఊరేగింపు కార్యక్రమంలో నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటుచేస్తే కమిటీ సభ్యులపై కేసు నమోదుచేసి, డీజేను సీజ్ చేస్తామని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ హెచ్చరించారు. అంబాజీపేట వాసవి కన్యాకపరమేశ్వరి కల్యాణ మండపంలో శుక్రవారం సీఐ రుద్రరాజు భీమరాజు అధ్యక్షతన నియోజకవర్గంలోని ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం నియోజకవర్గంలో 230విగ్రహాలు నిమజ్జనం చేస్తారన్నారు.ఉత్సవాలను రాత్రి 9గంటలలోపు ముగించాలన్నారు. ఎస్ఐలు చిరంజీవి, చైతన్యకుమార్, హరికోటిశాస్త్రి, శివకృష్ణ పాల్గొన్నారు.

గణపతి ఆలయాల వద్ద అన్నసమారాధనలు

అంబాజీపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల్లో భాగంగా మండలంలో పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన గణపతి పందిళ్ల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. మాచవరం మెట్లకాలనీలోని శ్రీరామ్‌నగర్‌లో శ్రీసిద్ధివినాయక ఆలయం వద్ద స్వామివారి లడ్డూలను కాకర శివ రూ.15వేలు, కె.కోటేష్ రూ.4,100, మీనాక్షి సిల్క్స్, సూర్య రడీమేడ్స్ రూ.3600కు వేలంలో దక్కించుకునారు. అలాగే సత్యసాయినగర్‌లో గణపతి ఆలయంవద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ఏఎంసీ చైర్మన్ వెంకటలక్ష్మికి అభినందనలు

రాజోలు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజోలు ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన కేతా వెంకటలక్ష్మిని తాటిపాకలో ఆమె స్వగృహంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ శుక్రవారం పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వెంకటలక్ష్మికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాజోలు ఎంపీపీ కడలి శ్రీదుర్గ, రాజోలు నియోజకవర్గ పోలింగ్‌బూత్ కన్వీనర్, కోఆర్డినేటర్ చాగంటి స్వామి, అడబాల విజయ్, ముప్పర్తి నాని, అడబాల యుగంధర్ తదితరులు ఉన్నారు.

ప్రైవేటు బస్సులకు జరిమానా

ముమ్మిడివరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ అధికారులు అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. 11 ప్రైవేటు బస్సులపై కేసులు నమోదుచేసి రూ.22వేల అపరాధ రుసుం విధించారు. నిబంధనలు పాటించని ప్రైవేటు బస్సులపై కేసులు నమోదుచేసి జరిమానా విధించామని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, జ్యోతిసురేష్, కౌశిక్ పాల్గొన్నారు.

'చర్యలు తీసుకోండి'

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీలపై అసభ్యకర వ్యాఖ్యలు రాసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాలమహానాడు జేఏసీ శుక్రవారం ఎంపీడీవో భూపతిరాజు తులసీకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. సినీ హీరోల పుట్టినరోజులు, సినిమాల విడుదల సందర్భంగా ఒక వర్గాన్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలతో ఫ్లెక్సీల ఏర్పాటు చేయడం తగదన్నారు. ప్రింటింగ్ నిర్వాహకులపై సైతం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. గెద్దం సురేష్‌బాబు, కడిమి చిన్నవరాజు, కుంచే బాబులు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, సాదే శ్రీనివాసరావు, కాశి శ్రీరామ్, గుంట్రు చిట్టిబాబు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అమ్మిరాజుకు అభినందనలు



పి.గన్నవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికైన పి.గన్నవరం హైస్కూలు ఉపాధ్యాయుడు గన్నవరపు అమ్మిరాజు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ నుంచి ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నారు. ఈసందర్భంగా అమ్మిరాజును హైస్కూలు హెచ్‌ఎం ఉమాదేవి, సహచర ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అలాగే ఉపాధ్యాయ సంఘాలు, 1995-96 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

జి.వేమవరం పాఠశాలకు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు



ఐ.పోలవరం,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి):జి.వేమవరం జడ్పీ హైస్కూల్‌కు 2024-25 సంవత్సరానికి జిల్లా స్థాయిలో స్కూల్‌ఆఫ్‌స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు లభించింది. స్పోర్ట్స్ డే సందర్భంగా ఈఅవార్డు లభించింది. కలెక్టర్ మహేష్‌కుమార్ శుక్రవారం హెచ్‌ఎం వారణాసి సుభద్రాలక్ష్మీదేవికి అవార్డు అందించారు. జిల్లాలో300పాఠశాలలు పాల్గొనగా 248పాయింట్స్‌తో జి.వేమవరంహైస్కూల్ ప్రథమస్థానంలో నిలిచింది. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, డీఈవో సలీంబాషా, సర్పంచ్ నల్ల సుదర్శన్‌రావు పాఠశాలబృందాన్ని అభినందించారు. సుభద్రాలక్ష్మీదేవి, పీడీజి.కళావతి, పీడీఅడ్డగాళ్ళ నాగరాంప్రసాద్‌పాల్గొన్నారు. హెచ్‌ఎంను పీఎంసీ చైర్మన్ బసవా అప్పారావు, గుత్తెనదీవి సర్పంచ్ లంకలపల్లి దుర్గాదేవీమునిరాజు, సొసైటీచైర్మన్ పెంట రవి అభినందించారు.

వైసీపీ గ్రామకమిటీ అధ్యక్షుడిగా రాంబాబు



కాట్రేనికోన, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరం వైసీపీ గ్రామకమిటీని ఎంపీటీసీ అక్కల శ్రీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. గ్రామకమిటీ అధ్యక్షుడిగా రెడ్డి రాంబాబు, ఉపాధ్యక్షులుగా మోకా శ్రీను, ఎరుబండి మహేష్, ప్రధాన కార్యదర్శులుగా కర్రి త్రినాధవెంకటనరసింహులు, తిరుకోటి వెంకన్నబాబు, కార్యదర్శిగా కొల్లు సత్యవరప్రసాద్, యువజన విభాగం అధ్యక్షునిగా మాకా ఆనంద్ ఎన్నికయ్యారు.



ద్రాక్షారామలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ భవానీ

సమాజ ఉన్నతిలో గురువుల పాత్ర ప్రధానం

● కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ● ఘనంగా గురుపూజోత్సవం

కొత్తపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సమాజంలో గురువుల పాత్ర ఉన్నతమైనదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం స్థానిక కాంతి భారతి విద్యాసంస్థల్లో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ రాజమహేంద్రవరం లో ఉపాధ్యాయుడిగా పనిచేయడం ఈ ప్రాంతవాసులకు గర్వకారమణమన్నారు. అనంతరం ఎంఈవో హరిప్రసాద్‌తోపాటు పలువురు ఉపాధ్యాయుల ను ఆయన సత్కరించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, భాస్కరరావు, ఉపసర్పంచ్ విశ్వ మారుతీప్రసాద్, కంఠంశెట్టి శ్రీనివాస్, గనిశెట్టి వీరేష్, బయ్యే రాంబాబు, వాసంశెట్టి సత్యనారాయణ, యెలిశెట్టి ప్రభాకర్, తోట వెంకటేశ్వరరావు, తోట సత్యవాణి, రమాదేవి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

రాయవరం(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ సమావేశపు హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన నూలు ఆదినారాయణ, గరగ సీతాదేవి, సింగ్‌బాబు,కె.వెంకటరమణతోపాటు మండలంలోని మూడు స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని ముగ్గురు ఉపాధ్యాయుల వంతున మొత్తం 16మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, జడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, డీవైఈవో ప్రత్తి రామలక్ష్మణ మూర్తి, ఎంఈవో వై.సూర్యనారాయణ లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు పాల్గొన్నారు.

● రాయవరం విజ్ఞాన్ పాఠశాల, కళాశాల్లో జరిగిన టీచర్స్ డే కార్యక్రమంలో ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లిడి ఆదిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు, జ్ఞానం, విలువలు, క్రమశిక్షణ నేర్పించేది గురువులు మాత్రమేనన్నారు. తొలుతగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళ్లు అర్పించారు. ఈకార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ మల్లిడి శేషవేణి, ప్రిన్సిపాల్ ఎస్. అచ్చిరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సతీష్‌రెడ్డి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.త్రివేణి సుబ్బిరెడ్డి, కేపీఎన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని ఎంపీపీ అంబటి భవాని అన్నారు. శుక్రవారం ద్రాక్షారామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారపుపేటకు చెందిన కాలెపు నాగరత్నం, కాలెపు నరసింహరావు దంపతులు ఏర్పాటుచేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఎంపీపీ ఆవిష్కరించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విలువలు పెరగడానికి కారణం ఉపాధ్యాయులే అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం, జెడ్పీపాఠశాల 25 ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా విగ్రహాన్ని ప్రారంభించారు. విగ్రహం ఏర్పాటుచేసిన దాతలకు స్టాఫ్ సెక్రటరీ అరవ విస్సు కృతజ్ఞతలు తెలిపారు.వైస్ ఎంపీపీ నరాలరాజ్యలక్ష్మీ, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉపసర్పంచ్ బుచ్చిరాజు, హెచ్ఎం పెరిచర్ల శేఖర్, ఎస్ఎంసీ చైర్మన్ కోన నాగజ్యోతి, కోటిపల్లి అబ్బు, వెంకన్నబాబు, రామకృష్ణ, ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చేతుల్లోనే దేశభవిష్యత్

రామచంద్రపురం(ద్రాక్షారామ),(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల చేతుల్లోనే దేశభవిష్యత్ ఉం దని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని టీడీపీ కార్యాలయంలో ప్రభుత్వ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ సలాది వెంకప్పనాయుడు మాస్టారు, ఏఎంసీ మాజీ చైర్మన్ గిరిగిపాటి సూర్యనారాయణమూర్తి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, టీడీపీ నాయకులు కడియాల రాఘవన్, చందమామ వాసు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, ఎంఈవోలు తాడి వీరరాఘవరెడ్డి, ఏ.నాగరాజు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.



కొత్తపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు, కలెక్టర్ మహేష్‌కుమార్ నుంచి అవార్డు అందుకుంటున్న మాణిక్యాలరావు

అవార్డు అందుకున్న మాణిక్యాలరావు

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చేతులు మీదుగా ఆత్రేయపురం మండలం మెర్లపాలెం శివారు వాసంశెట్టివారిపాలెం హెచ్ఎం జి.మాణిక్యాలరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్న మాణిక్యాలరావును ఉపాధ్యాయులు ఘనంగా అభినందించారు.

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): పొగట్లపల్లి జడ్పీ పాఠశాలలో హెచ్ఎం శేషకుమార్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు గోకవరపు పద్మనాభం సర్వేపల్లి రాధాకృష్ణ వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు పలు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు.





రామచంద్రపురంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సత్యం,తదితరులు , రావులపాలెం: పొడగట్లపల్లి జడ్పీ పాఠశాలలో సర్వేపల్లి రాధాక్రిష్ణన్ వేషధారణలో ఉపాధ్యాయుడు పద్మనాభం

ఘనంగా మహా సుదర్శన హోమం



ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, లక్ష్మీగణపతి ఆలయంలో హోమం దృశ్యం

ఆత్రేయపురం, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణ నక్షత్రం సందర్భంగా శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిక్కవోలు కేశవాచార్యులు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు పవన్‌దీక్షితులు, రవికృష్ణ ఆధ్వర్యంలో మహాసుదర్శన హోమం అభిషేకం స్వామివారి కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ వీవీ సత్యనారాయణరాజు-రాజ్యలక్ష్మీ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తజనం పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.



రెడ్డి అనంతకుమారి, సుబ్రహ్మణ్యం దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

వెంకన్నను దర్శించుకున్న రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ అనంతకుమారి

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ చైర్‌పర్సన్ రెడ్డి అనంతకుమారి, పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలకగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకుని స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందించారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ ముదునూరి వెంకట్రాజు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర శ్రీ వైభవ వెంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో వెంకన్న జన్మనక్షత్ర పూజలు శుక్రవారం కనులపండువగా జరిగాయి. ఆలయ అర్చకుడు కె.బాలబాలాజీ ఆధ్వర్యంలో పలువురు పండితులు స్వామివారికి అభిషేకాలు, విశేషపూజలు, స్వామివారి శ్రవణానక్షత్ర పూజలు వేదమంత్రోశ్చరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు.

శరన్నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లకు రాట ముహూర్తం

రామచంద్రపురం(ద్రాక్షారామ),సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం పట్టణంలో పార్కువద్ద వెలసిన కనకదుర్గ ఆలయం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి శుక్రవారం ఉదయం 10.29 గంటలకు రాట ముహూర్తం చేశారు. కౌన్సిలర్ అంకం శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాహుబలి మట్టిగణపయ్యకు సామూహిక హారతులు

ఆలమూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మెయిన్‌రోడ్డులోని లక్ష్మీగణపతి ఆలయంవద్ద ఏర్పాటుచేసిన బాహుబలి మట్టిగణపయ్యకు శుక్రవారం మహిళలు సామూహిక వీడ్కోలు హారతులు నిర్వహించారు. ఈఏడాది 13అడుగుల మట్టి గణపయ్యను ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలను ఆలయ కమిటీ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో శుక్రవారం మహిళలు స్వామివారికి సామూహిక హారతులను ఇచ్చారు. శనివారం నిమజ్జన కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.



ఆలమూరులో బాహుబలి మట్టి గణపయ్యకు హారతులు ఇస్తున్న మహిళలు

ఘనంగా గణనాధుడి నిమజ్జనం

మండపేట,సెప్టెంబరు,5(ఆంధ్రజ్యోతి) మండపేట పట్టణంలో పాటిమీద శెట్టిబలిజ సంఘీయుల ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి వారి నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విచిత్ర వేషధారుణలు, ఆట పాటలతో సందడిగా భారీ ఊరేగింపు నడుమ పట్టణంలో నిర్వహించారు. గీతకార్మికులు కులదైవం కల్లుగీతకు చిహ్నంగా తాటిచెట్టు కల్లుగీస్తున్నట్లు చెట్టును ట్రాక్టర్‌పై ఏర్పాటుచేసి నిర్వహించిన ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది.

అంతా సోదరభావంతో మెలగాలి

● మతగురువు డాక్టర్ మిజ్ బాహి పిలుపు

మండపేట, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): అల్లా చూపిన మార్గంలో సమాజంలో మానవాళి అంతా నడుచుకోవాలని ప్రముఖ ముస్లిం మతగురువు యూపీకి చెందిన డాక్టర్ అహ్మద్ మిజ్‌బాహి ప్రజలకు పిలుపునిచ్చారు. మహ్మద్‌ప్రవక్త 1500 జయంతిని పురష్కరించుకుని మండపేట పట్టణంలోని జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం మండపేట పట్టణంలో వున్న జామీయా మసీదు నుంచి భారీ ర్యాలీని పట్టణంలో నిర్వహించారు. అనంతరం స్థానిక డొక్కా సీతమ్మ భవనంలో అధ్యాత్మిక కార్యక్రమంను నిర్వహించారు. అనంతరం పెద్దమసీదుతోపాటు రావులపేటలో మసీదు, గాంధీనగర్‌లోవున్న చిన్నమసీదు వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అలాగే మండపేట మండలంలో ద్వారపూడి, కేశవరం, వెలగతోడు, ఏడిద, తదితర గ్రామాల్లో ప్రవక్త జయంతి వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగరలో శుక్రవారం ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసజిద్-ఎ-ఇబ్రహీం నందు మసీదు ముతవల్లి మహ్మద్ అబ్బాస్ హుస్సేన్ ఆధ్వర్యంలో మసీదు ఇమామ్ మహ్మద్ నాజీం అక్తర్ మహాప్రవక్త మహ్మద్ సల్లెలహు ఆలైహివసల్లెం వారి జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



మండపేటలో సందేశంను ఇస్తున్న డాక్టర్ మిజ్ బాహి, అంగరలో మహ్మద్ సల్లెలహు ఆలైహి వసల్లెం వారి జీవిత చరిత్రను వివరిస్తున్న దృశ్యం

వేణుగోపాలస్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణస్వీకారం

రాయవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మం డలంలోని లొల్ల శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం శుక్రవారం నిర్వహించారు. చైర్మన్‌గా సుంకవిల్లి గంగరాజు, సభ్యులుగా వెలంపాలెపు ఆదిలక్ష్మి, చాట్రాతి అన్నపూర్ణ, వెలంపాలెపు సత్యప్రభ, ఏలేటి వెంకట్రావు, సుంకవల్లి రమాదేవి, అంగర బాబు, వాసాబత్తుల మంగాలక్ష్మి, లంక రాముడు, అంగర వెంకట రామకృష్ణ శోభన్‌బాబు తదితరులచే ఈవో ఎం.రాంబాబురెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ అభివృద్ధికి నూతన పాలకమండలి కృషి చేయాలని పలువురు వ్యక్తలు పిలుపునిచ్చారు. సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, ఎంపీటీసీ వైట్ల సతీష్, ఆలయ సిబ్బంది కామేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేసిన లొల్ల వేణుగోపాల స్వామి ఆలయ పాలకమండలి

తీర్థయాత్రలకు మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

రామచంద్రపురం(ద్రాక్షారామ),సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు శుక్రవారం తీర్థయాత్రలకు పయనమయ్యారు. పూరి, కోణార్క్, గయ, కాశి, అయోధ్య, డిల్లీ సందర్శనకు బయలుదేరి వెళ్లారు. రామచంద్రపురం నుంచి బస్సులో యాత్రలకు బయలుదేరి వెళ్లారు.



తీర్థయాత్రలకు పయనమైన కౌన్సిలర్లు

సన్యాసిరావును అభినందించిన ఆర్టీవో శ్రీనివాసరావు

మండపేట, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి) కష్టపడి చదువుకున్న చదువు ఊరికేపోదని అందుకు నిదర్శనమే మండపేట మండలం వెలగ తోడుకు చెందిన ముల్లు సన్యాసిరావు అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రవాణా శాఖాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సన్యాసిరావు డీఎస్సీ చదివి ఉద్యోగంరాక తాను నేర్చుకున్న డ్రైవింగ్ ద్వారా రోలర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ ఎటువంటి కోచింగ్ లేకుండా పట్టుదలతో చదివి 396వ ర్యాంకు సాధించటం సామాన్య విషయంకాదని జిల్లా రవాణాశాఖధికారి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం వెలగతోడులో వున్న సన్యాసిరావు శుక్రవారం ఇంటికి వెళ్లి అభినందించారు. వాహన డ్రైవర్‌గా పనిచేస్తూ నిరుపేద కుటుంబానికి చెందిన సన్యాసిరావు నేటి యువతకు ఆదర్శమని ఆయన అన్నారు. సన్యాసిరావును ఉపాధ్యాయ దినోత్సవంరోజున కలుసుకుని సత్కరించటం తనకెంతో ఆనందంగా ఉందని శ్రీనివాసరావు చెప్పారు. సన్యాసి రావు తల్లిదండ్రులను కూడా జిల్లా రవాణా శాఖాధికారి సత్కరించి అభినందించారు. జిల్లా అధికారి శ్రీనువాసరావుకు రుణపడి ఉంటానని సన్యాసిరావు చెప్పారు.



డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికైన ముల్లు సన్యాసిరావును అభినందిస్తున్న ఆర్టీవో శ్రీనివాసరావు

జీఎస్టీ తగ్గించి లక్షలాది కుటుంబాలకు తీపి కబురు

కొత్తపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జీఎస్టీ తగ్గించి లక్షలాది కుటుంబాలకు తీపికబురు చెప్పారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కొత్తపేటలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్యులకు నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రజలకు దసరా, దీపావళి కానుకని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ప్రధానిమోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

పేదల ప్రభుత్వం బీజేపీ

రాయవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని కొత్తగా ప్రవేశపెట్టిన జీఎస్టీ శ్లాబులతో మరోసారి రుజువైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకి రాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని లొల్ల గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సామాన్యుడికి అవసరమైన ప్రతి వస్తువుపైన ఇప్పటివరకు ఉన్న జీఎస్టీని భారీగ తగ్గించిదన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కొత్తపేట,సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల నరికివేత నిమిత్తం వానపల్లి, బిళ్ళకుర్రు, మోడేకుర్రు, గొలకోటివారిపాలెం, రాకూర్తివారిపాలెం పితానివారిపాలెం,చిరతపూడిలలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాంబాబు కోరారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారం

ఆత్రేయపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వద్దిపర్రు దళితపేటలో లోవోల్టేజీ సమస్యతో గృహవినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని సర్పంచ్ జుజ్జవరపు శ్యామల, నీటి సంఘం అధ్యక్షుడు హరిబాబు ఎమ్మెల్యే బండారు దృష్టికి తీసుకునివెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ట్రాన్స్‌కో ఏఈ అశోక్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశారు.

నానో ఎరువులతో అధిక లాభం : ఏడీఏ

కె.గంగవరం, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): రైతులు నానో ఎరువులు వాడడంవల్ల ఖర్చు తగ్గి అధిక లాభాన్ని ఆర్జిస్తారని వ్యవసాయశాఖ రామచంద్రపురం ఏడీఏ బి.నాగకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుందూరు సొసైటీవద్ద ఏర్పాటుచేసిన నానో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రసాయన ఎరువుల వాడకంవలన భూమి పాడవుతుందని, నానో ఎరువుల వలన భూమికి ఏవిధమైన హానీ ఉండదని చెప్పారు. నానో ఎరువులు బాగా పనిచేస్తున్నాయని వివరించారు. ఇఫ్కో జిల్లా మేనేజరు జి.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ నానో ఎరువులు సులభంగా పిచికారీ చేయడానికి డ్రోన్‌నుఇఫ్కో సంస్థ అందుబాటులోకి తీసుకువచ్చిందని చెప్పారు. రైతులకు నానో ఎరువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి ఏ. సద్గురుమూర్తి, సొసైటీ అధ్యక్షుడు జగతా వెంకటరమణ, కూటమి నాయకులు మేడిశెట్టి బాబి, కొరిపెల్ల సురేష్, ఎం.ఆనంద్, కొప్పాక సుమన్, వంటిపల్లి రవి, సంకురాత్రి వెంకటరావు సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు నానో యూరియా అందజేస్తున్న సొసైటీ అధ్యక్షుడు జగతా రమణ, ఏడీఏ నాగకుమార్

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



వాడపాలెంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం మండల పరిధి వాడపాలెం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 48 సమస్యలపై వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు పంపి వాటి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

విద్యతోనే ప్రగతి సాధ్యం

● ఎంపీ హరీష్‌మాధుర్



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేస్తున్న ఎంపీ హరీష్ మాధుర్

ద్రాక్షారామ,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి):విద్యతోనే ప్రగతి సాధ్యమని, ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎంపిహరీష్ మాధుర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం రామచంద్రపురం మండలం అంబికపల్లి అగ్రహారం రాజరత్న హెల్త్‌కేర్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టులో జరిగిన గ్యాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఎంపీ హరీష్ పాల్గొన్నారు. ఎంబీఏ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. రాష్ట్ర తెలుగు, సంస్కృతి పరిరక్షణ సమితి చైర్మన్ డా.ఆర్.డి.విల్సన్, డీఎస్పీ రఘువీర్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ అంకం రాంబాబు, కూటమి నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి వరద

ఆలమూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ప్రవాహం గత నాలుగైదు రోజులుగా నిలకడగా కొనసాగుతుంది. వరదనీరు తగ్గుముఖం పట్టినప్పటికి రెండు అడుగుల తగ్గి వరదనీరు నిలకడగా ప్రవహిస్తోంది. ఆలమూరు మండలం జొన్నాడ వద్ద పుష్కర్‌ఘాట్ ముంపులోనే ఉంది. మండలంలో గోదావరి లంకభూము లోతట్టు ప్రాంతాలలో ఉన్న వాణిజ్య పంటలు మునిగి తేలుతున్నాయి.



జొన్నాడ వద్ద వరద గోదావరి దృశ్యం

అన్నపూర్ణను కలసిన నాటక కళాపరిషత్ సభ్యులు

ద్రాక్షారామ, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): ఏపీ నాటక అకాడమీ డైరెక్టరుగా నియామకమైన పెంకె అన్నపూర్ణను ద్రాక్షారామ నాటక కళాపరిషత్ కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిశారు. ద్రాక్షారామ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు నాగిరెడ్డి సతీష్‌రావు, కోశాధికారి వేమవరపు రాంబాబు, సభ్యులు బి.వి.బి.ఎల్.నారాయణ, తీపర్తి సతీష్, ఆళ్లబుజ్జి, బుర్రకథా కళాకారులు గరగ బాబూరావు, వాడ్రేవు వెంకట్రావు, నాటక అకాడమీ డైరెక్టరు పెంకె అన్నపూర్ణను అభినందించి ఘనంగా సత్కరించారు.



నాటక అకాడమీ డైరెక్టరు అన్నపూర్ణను సత్కరిస్తున్న నాటక కళాపరిషత్ అధ్యక్షుడు

సామాజిక సేవలో వాసవీ వనితా క్వీన్స్ క్లబ్

ఆలమూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ అనుబంధంగా పనిచేస్తున్న వనితా క్వీన్స్‌క్లబ్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వాసవీక్లబ్ జిల్లా గవర్నర్ యెండూరి రాఘవకుమారి అన్నారు. ఆలమూరు వాసవీ వనితాక్వీన్స్ క్లబ్ అధ్యక్షురాలు సాయిలక్ష్మి అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి రాఘవకుమారి వనితాక్వీన్స్ సభ్యులకు పలు సూచనలు సలహాలు అందించారు. స్థానిక భవిత స్కూల్‌కు ఫ్లోర్‌మేట్స్, పేదలకు నిత్యావసర వస్తువులు, చీరలు, రగ్గులు, లలితా మందిరంనకు స్టూల్స్ అందించారు. సమాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆలమూరు క్లబ్ అధ్యక్షురాలు సాయిలక్ష్మిని అభినందించారు. ఈకార్యక్రమంలో వెత్సా లక్ష్మీశ్రీనివాస్, బచ్చు పార్వతీదేవి, చుండూరి సుధీర్, తటవర్తి సత్యనారాయణ, బొడా వీర్రాజు, వెత్సా సౌజన్య, కంచర్ల స్వాతి, వెత్సా సునంద, వై.సంతోషి పాల్గొన్నారు.



వాసవీ వనితా క్వీన్స్ క్లబ్ అధ్వర్యంతో జరిగిన కార్యక్రమాలకు హాజరైన జిల్లా గవర్నర్